మైదానంపై మంచు దుప్పటి

కోటవురట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీని తలపించేలా మైదాన ప్రాంతంలో కూడా దట్టంగా మంచు కురుస్తున్నది. నాలుగైదు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ తగ్గిపోతుండగా, చలి తీవ్రత అధికమవుతున్నది. మధ్యాహ్నం సైతం శీతల గాలులు వీస్తున్నాయి. రాత్రి ఏడు గంటల నుంచే చలి మొదలవుతున్నది. అర్ధరాత్రి నుంచి మరుసటి రోజు ఉదయం తొమ్మిది గంటల వరకు మంచు విపరీతంగా కురుస్తున్నది. వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. మంచు, చలి కారణంగా వ్యవసాయ పనులు ఆలస్యంగా మొదలవుతున్నాయి.



నెలగంట సూచికగా ఘంటారావం చేస్తున్న ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు



గరుడ వాహనంపై ఉభయ దేవేరులతో శ్రీవారు



కోటవురట్లలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

నెల గంట మోగింది!

- ఉపమాక క్షేత్రంలో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం
- నేత్రపర్వంగా తిరువీధి సేవ

నక్కపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో సోమవారం ఉదయం 6.57 గంటలకు ధనుర్లగ్నం ఘడియల్లో నెలగంటతో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం చేసి ధూప, దీప నైవేద్య నీరాజనాలు సమర్పించారు. కింద ఆలయంలో నిత్య హోమాలు చేసి, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి, ఉభయదేవేరులతో కూడిన ఉత్సవమూర్తులను పట్టుపీతాంబరాలు, శేషవస్త్రాలతో అలంకరించారు. తదుపరి కొండపైన ఆలయంలో ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు ఘంటానాదం చేశారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీవారి తిరువీధి సేవ నిర్వహించారు. గరుడ వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారు, ఆ వెనుక పల్లకీపై గోదాదేవి అమ్మవారు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధి వద్ద ప్రముఖ కవయిత్రి డాక్టర్ గాయత్రీదేవి తిరుప్పావై పాశురవిన్నపం చేశారు. ఈ సందర్భంగా ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు మాట్లాడుతూ, ధనుర్మాసం సందర్భంగా నెల రోజులపాటు స్వామివారు, గోదాదేవి అమ్మవారి తిరువీధి సేవలు జరుగుతాయని చెప్పారు.

వరి కోతలకు కూలీల కొరత

దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

- రెట్టింపు కూలి ఇస్తామన్నా కూలీలు లభించని పరిస్థితి
- రెండు వారాల నుంచి అనిశ్చిత వాతావరణమే కారణం
- బంగాళాఖాతంలో మరోసారి అల్పపీడనంతో గుబులు

చోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరి కోతలు ఊపందుకున్నాయి. అయితే కూలీల కొరత కారణంగా రైతులు సకాలంలో వరికోతలు పూర్తిచేయలేక పోతున్నారు. ఈ నెలలో బంగాళాఖాతంలో రెండు పర్యాయాలు ఏర్పడిన వాయుగుండాలు, ఒకసారి తుఫాన్‌గా మారడంతో అధికారుల సూచనల మేరకు రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. నాలుగైదు రోజుల నుంచి వాతావరణం అనుకూలంగా వుండడంతో వరి కోతలకు ఉపక్రమించారు. దీంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ ఏర్పడింది. సాధారణంగా ఇచ్చే కూలి కన్నా ఎక్కువ ఇస్తామన్నా కూలీలు లభించని పరిస్థితి నెలకొంది.



కూలీల కొరత కారణంగా మందకొడిగా సాగుతున్న వరి కోతలు

బంగాళాఖాతంలో తరచూ అల్పపీడనాలు ఏర్పడుతున్నాయి. ఇవి వాయుగుండాలుగా, తుపాన్లుగా బలపడి భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో పండిన వరి పంట చేతికి అందకుండా పోతుందేమోనని రెండు వారాల నుంచి రైతులు కంటి మీద కునుకు లేకుండా ఆందోళన చెందుతున్నారు. వాస్తవంగా ఈ నెలలో వాతావరణం అనుకూలించివుంటే ఇప్పటికే మూడింట రెండు వంతుల విస్తీర్ణంలో వరి కోతలు పూర్తయ్యేవి. కానీ గత రెండు వారాల్లో రెండుసార్లు అల్పపీడనాలు, వాయుగుండాలు, ఒకసారి తుపాన్ హెచ్చరికతో రైతులు వరి కోతలను వాయిదావేసుకున్నారు. గత వారం వాయుగుండం ప్రభావంతో ఆకాశం మేఘావృతమైనప్పటికీ వర్షాలు పడకపోవడంతో అన్నదాతలు ఊపిరిపీల్చుకున్నారు. నాలుగైదు రోజుల నుంచి వాతావరణం అనుకూలంగా వుండడంతో వరి కోతలు మొదలుపెట్టారు. రెండు రోజులు గడిచేసరికి ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఇది మరింత బలపడి సోమవారంనాటికి దక్షిణ బంగాళాఖాతం పరిసరాల్లో అల్పపీడనంగా మారిందన్న సమాచారంతో రైతులు మరోసారి ఆందోళన చెందుతున్నారు. వరి కోతలు ఆలస్యం అయితే గింజ రాలిపోయే ప్రమాదం వుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 18, 19 తేదీల్లో అనకాపల్లి జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ వెల్లడించడంతో వెంటనే వరికోతలు పూర్తిచేయడానికి నడుంబిగించారు. దీంతో ఒక్కసారిగా కూలీల కొరత ఏర్పడింది. ఎక్కువ మంది రైతులు ఒకేసారి వరి కోతలకు సన్నద్ధం కావడం, మరోవైపు ఈ ప్రాంతం నుంచి వ్యవసాయ కూలీలు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వరి కోతల పనులకు నెల రోజుల ముందే వెళ్లడంతో ఇక్కడి రైతులకు కూలీలు లభించడం లేదు. సాధారణ కూలి కన్నా రెట్టింపు డిమాండ్ చేస్తుండడంతో ఏం చేయాలో రైతులకు పాలుపోవడంలేదు.

సాధారణంగా ఆడ కూలీకి రూ.250 నుంచి రూ.300, మగవాళ్లకైతే ... మిగతా 8వ పేజీలో

రైతుకు ఏమీ మిగలడంలేదు

\- శరపతి సీతారారత్నం, చీడికాడ



దుక్కి దున్నడం నుంచి వరి నూర్పుల వరకు అన్ని రకాల ఖర్చులు విపరీతంగా పెరిగిపోతు న్నాయి. కానీ ధాన్యం మద్దతు ధర మాత్రం గొర్రె తోక బెత్తడు అన్న చందంగా వుంటున్నది. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి పంట పండిస్తే చివరకు మాకు మిగిలేది ఏమీ లేదు. వరికోతలకు కూలీలను అడిగితే రూ.500 అడుగుతున్నారు. అంత మొత్తం కూలి ఇచ్చుకోలేక కుటుంబ సభ్యులంతా కలిసి వరి పైరు కోసి, కుప్పపెట్టుకున్నాం.


కోళ్లఫారంలో యువతి ఆత్మహత్య

- భర్త మందలించడంతో మనస్తాపం
- సొంతూరు పాడేరు మండలం బడిమేల
- కోళ్ల ఫారంలో ఉపాధి కోసం ఆరు నెలల క్రితం వచ్చిన భార్యాభర్తలు

మాకవరపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంగాలపల్లిలో వున్న ఒక కోళ్లఫారంలో వివాహిత యువతి ఆత్మహత్య చేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రాంతానికి చెందిన ఈమె కోళ్లఫారంలో పనిచేయడానికి భర్తతో కలిసి ఆరు నెలల కిందట ఇక్కడకు వచ్చింది. పని విషయంలో భర్త మందలించడంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్ఐ దామోదరనాయుడు తెలిపారు. ఈ ... మిగతా 8వ పేజీలో

లారీని ఢీకొన్న కారు

ఒకరి మృతి, ఇద్దరికి తీవ్రగాయాలు





సత్యమూర్తి (ఫైల్‌ఫొటో), నుజ్జునుజ్జయిన కారు

కశింకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లపాలెం వద్ద జాతీయ రహదారిపై జరిగిన వాహన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. చెన్నైలో కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ఆర్.సత్యమూర్తి (44) తన స్నేహితులైన హుస్సేన్, ఇషాక్‌తో కలిసి కారులో అరకులోయ పర్యటనకు బయలుదేరారు. సోమవారం తెల్లవారు జామున తాళ్లపాలెం వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. దీంతో కారు తీవ్రంగా దెబ్బతిన్నది. కారు నడుపుతున్న సత్యమూర్తి అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలిన ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఇషాక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

కాసులిస్తేనే రిజిస్ట్రేషన్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో షరా 'మామూళ్లే!'

- ఆస్తి విలువపై ఒక శాతం వసూలు
- చేతికి మట్టి అంటకుండా దస్తావేజు లేఖర్ల ద్వారా కథ నడిపిస్తున్న ఉద్యోగులు
- డబ్బులు ఇవ్వకపోతే కుంటి సాకులతో రిజిస్ట్రేషన్ పెండింగ్

నర్సీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మామూళ్లు ఇవ్వనిదే ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్ జరగడం లేదని కక్షిదారులు ఆరోపిస్తున్నారు. ఆస్తి రిజిస్ట్రేషన్ విలువపై ఒక శాతం సొమ్మును అదనంగా వసూలు చేస్తున్నారు. అయితే కార్యాలయం ఉద్యోగులు తమ చేతికి మట్టి అంటకుండా.. దస్తావేజు లేఖర్ల ద్వారా 'పర్సంటేజీ' సొమ్ము వసూలు చేస్తున్నారు.



నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో నర్సీపట్నం, రోలుగుంట, రావికమతం, గొలుగొండ మండలాలతోపాటు మాకవరపాలెం మండలంలో ఏడు గ్రామాలు ఉన్నాయి. స్థలాలు, వ్యవసాయ భూములు, ఇళ్ల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్‌కు ఇక్కడకే రావాలి. ఆస్తి కొనుగోలు చేసిన వ్యక్తులు స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు, ఇతరత్రా కలిపి ఆస్తికి సంబంధించి రిజిస్ట్రేషన్ విలువపై 7.5 శాతం వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సి వుంటుంది. ప్రభుత్వం ఏటా భూముల విలువ పెంచుకుంటూ పోతుండడంతో ఆస్తుల కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన్ ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయి. రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీతోపాటు ఆస్తి విలువపై ఒక శాతం సొమ్మును సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో మామూళ్ల పేరుతో వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే కార్యాలయం ఉద్యోగులు తమ చేతికి మట్టి అంటకుండా మామూళ్ల వ్యవహారాన్ని దస్తావేజు లేఖర్ల ద్వారా నడిపిస్తున్నారు. నిబంధనల ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి ఆస్తుల అమ్మకం/ కొనుగోలుదారులు, సాక్షి సంతకాలు చేసే వ్యక్తులను మాత్రమే అనుమతించాలి. కానీ ఇక్కడ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో దస్తావేజు లేఖర్లు హల్‌చల్ చేస్తుంటారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆస్తి విలువపై ఒక శాతంతోపాటు దస్తావేజులు తయారు చేసినందుకు ఫీజును కలిపి దస్తావేజు లేఖర్లు వసూలు చేస్తున్నారు. సాయంత్రం కార్యాలయం పనివేళలు ముగిసిన తరువాత ఏ దస్తావేజు లేఖ ఎన్ని రిజిస్ట్రేషన్లు చేయించారు, మామూళ్లు ఎంత రావాలి అన్నది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆయా దస్తావేజు లేఖర్లకు సమాచారం వెళుతున్నట్టు తెలిసింది. ఆ మేరకు కార్యాలయం ఉద్యోగుల్లో కింద నుంచి పైవరకు ఎవరి వాటా డబ్బులు వారికి పంపుతుంటారు. ఇది జగమెరిగిన సత్యం! సుమారు రూ.50 లక్షల విలువగల ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ.50 వేలు సమర్పించుకోవాల్సి వస్తున్నదని ఆస్తుల ... మిగతా 8వ పేజీలో

తాబేళ్ల మరణ మృదంగం

- సముద్రతీరానికి కొట్టుకొస్తున్న కళేబరాలు
- రసాయన పరిశ్రమలు, రొయ్యల హేచరీలే కారణమంటున్న మత్స్యకారులు
- కాలుష్య వ్యర్థాలను నేరుగా సముద్రంలోకి విడుదల చేస్తున్నారని ఆరోపణ



రత్నయ్యమ్మపేట వద్ద సముద్రతీరంలో తాబేలు కళేబరం



పూడిమడక తీరానికి కొట్టుకు వచ్చిన తాబేలు కళేబరం

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నయ్యమ్మపేట వద్ద సముద్ర తీరానికి సోమవారం రెండు తాబేళ్ల కళేబరాలు కొట్టుకు వచ్చాయి. ఈ ప్రాంతంలో తరచూ తాబేళ్లు చనిపోతుండడంతో మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. పరవాడ మండలం నుంచి పాయకరావుపేట మండలం వరకు సముద్ర తీర ప్రాంతంలో రసాయన పరిశ్రమలు, రొయ్యల హేచరీల నుంచి శుద్ధి చేయకుండా విడుదల చేసే కాలుష్య వ్యర్థాల కారణంగా సముద్ర సంపద మృత్యువాత పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలుష్యం కారణంగా సముద్ర తీరం నుంచి చాలా దూరం వరకు మత్స్య సంపద సంచరించడంలేదని, తాము మైళ్ల కొద్దీ లోపలికి వెళితే తప్ప చేపలు లభ్యం కావడం లేదని అంటున్నారు. ఆదివారం ఉదయం అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద సముద్ర తీరానికి తాబేలు కళేబరం కొట్టుకురావడాన్ని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. రెండు రోజుల వ్యవధిలో మూడు తాబేళ్ల కళేబరాలు సముద్ర తీరానికి కొట్టుకు వచ్చిన విషయాన్ని అధికారులు తీవ్రంగా పరిగణించాలని, కాలుష్య వ్యర్థాలను సముద్రంలోకి విడిచిపెడుతున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు విజ్ఞప్తి చేస్తున్నారు. లేకపోతే మత్స్యసంపదకు ముప్పు వాటిల్లి తాము జీవనోపాధి కోల్పోయే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎలమంచిలిలో భారీ చోరీ

- విశ్రాంత ఉద్యోగి ఇంటిలో రూ.4 లక్షల నగదు, నాలుగు తులాల బంగారం అపహరణ

ఎలమంచిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామ్మూర్తినగర్ ప్రాంతంలో భారీ చోరీ జరిగింది. ఎక్సైజ్ శాఖకు చెందిన విశ్రాంత ఉద్యోగి ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి, నాలుగు లక్షల రూపాయల నగదు, నాలుగు తులాల బంగారం ఆభరణాలను అపహరించుకుపోయారు. ఇందుకు సంబంధించి పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు వివరాలిలా వున్నాయి.

ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం చేసి రిటైర్ అయిన బీవీ రమణ స్థానిక రామ్మూర్తినగర్ ప్రాంతంలో నివాసం వుంటున్నారు. రెండు అంతస్థుల భవనంలో కింద రెండు పోర్షన్లు అద్దెకు ఇవ్వగా, పై అంతస్థులో రమణ కుటుంబ నివాసం వుంటున్నది. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులంతా కలిసి కర్ణాటక రాష్ట్రం బళ్లారిలో వుంటున్న కుమార్తె వద్దకు గత మంగళవారం వెళ్లారు. సోమవారం ఉదయం పనిమనిషి వచ్చి, మెట్లమార్గానికి వున్న గేటు తాళం తీసివుండడాన్ని గమనించింది. ఈ విషయాన్ని ... మిగతా 8వ పేజీలో



చోరీ జరిగిన ఇంటిలో చిందర వందరగా పడేసిన వస్తువులు

ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లతో నేడు రెవెన్యూ మంత్రి సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలతో రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం విశాఖ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతుల పరిష్కారం, ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సులు, నిషేధిత జాబితా 22-ఎ నుంచి భూముల తొలగింపు, పలు ప్రాజెక్టులకు కేటాయించిన భూములు ఎలియనేషన్, అసైన్‌మెంట్ భూ వివాదాలు, భూముల రీసర్వే, ఫ్రీహోల్డ్ అనుమతులు, భూ సేకరణ, భూ సమీకరణ, చిన్నపాటి ఆక్రమణల క్రమబద్ధీకరణ, ప్రభుత్వం నిర్ణయాల మేరకు అమలు చేయాల్సిన ప్రాజెక్టుల తాజా స్థితి తదితర 12 అంశాలపై మంత్రి సమీక్షిస్తారు. మంగళవారం ఉదయం తొలుత కలెక్టరేట్‌లో ప్రజల నుంచి మంత్రి వినతులు స్వీకరిస్తారు. ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు. కాగా సోమవారం నగరానికి చేరుకున్న మంత్రికి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఆర్డీవో శ్రీలేఖ, తదితరులు స్వాగతం పలికారు. సమీక్ష కోసం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా, సీసీఎల్ఏ అదనపు చీఫ్ కమిషనర్ ఎన్. ప్రభాకరరెడ్డి నగరానికి చేరుకున్నారు.

ముమ్మరంగా వరి కోతలు



గుంటపల్లిలో వరి కోతలు కోస్తున్న రైతులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవరం, గుంటపల్లి, మాసాహెబ్‌పేట, గోపాలపట్నం, పెంటకోట, పెదరాంభద్రపురం, శ్రీరాంపురం తదితర గ్రామాలలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వాతావరణం మారి ఎండలు కాస్తుండడంతో రైతులందరూ ఒకేసారి కోతలు ప్రారంభించారు. దీంతో కూలీలకు తీవ్ర కొరత ఏర్పడింది. ఈ ఏడాది మండలంలో మూడు వేల హెక్టార్లలో రైతులు వరి సాగు చేశారు. ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించడంతో వరి పంట ఆశాజనకంగా పండి అధిక దిగుబడులు వస్తాయని రైతులు ఆశాభావంతో ఉన్నారు. అల్పపీడనం ముప్పు తప్పడంతో రైతులు ఊపిరిపీల్చుకుని కోతలు ప్రారంభించారు. వరి పంట తరువాత పైరు పంటగా అపరాలు చల్లుకున్నారు. అయితే కోతకు కూలీలు దొరక్కపోవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు.

వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడిగా గంగరాజు



రాంబిల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల సంఘం మండల అధ్యక్షుడుగా తేటకలి గంగరాజు నియమితులయ్యారు. సోమవారం రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగిన మండల వీఆర్వోల సంఘం సమావేశంలో గంగరాజును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా తమ్మిరాజు వెంకట మంగారావు, మండల కార్యదర్శిగా గారా క్రాంతి కిరణ్, మండల సహాయ కార్యదర్శిగా యల్లపు సన్యాసినాయుడు, మండల కోశాధికారిగా లాలం సంతోషికుమారి, కార్యవర్గ సభ్యులుగా కుంచా సన్యాసమ్మ, కమ్మనమంచి వెంకట సత్య సుబ్రహ్మణ్యంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ వివరాలను తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందజేశారు.

21న మండల సర్వసభ్య సమావేశం

రాంబిల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న శనివారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎస్. జయమాధవి తెలిపారు. ఆ రోజు ఉదయం పదిన్నర గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, శాఖాపరంగా అధికారులు విధిగా హాజరుకావాలని ఎంపీడీఓ జయమాధవి తెలిపారు.

గణిత పరీక్షలో సత్తా చాటిన శ్రీప్రకాష్ విద్యార్థులు



సత్తా చాటిన విద్యార్థులు హారిక, సత్యరోచన్

పాయకరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న గణిత ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఈ ఏడాది రామానుజన్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహించి ప్రతిభ పరీక్షలో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. సోమవారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అందించిన వివరాలిలా ఉన్నాయి. గత నెల 17న 35వ రామానుజన్ జాతీయ ప్రతిభా పరీక్షలో తమ విద్యార్థులు తుమ్మలపల్లి హారిక(3వ తరగతి), లెక్కల సత్యరోచన్(4వ తరగతి) జిల్లా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారని తెలిపారు. విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే.నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

నునపర్తిలో వివాదాస్పద స్థలంపై విచారణ

అచ్యుతాపురం, డిసెంబరు 16: మండలంలోని నునపర్తిలో వివాదాస్పద స్థలంపై ఎంపీడీఓ కె. ప్రభాకరరావు సోమవారం సాయంత్రం విచారణ జరిపారు. గ్రామ కంఠాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని ఒక వర్గం, గ్రామ కంఠం అయినప్పటికీ తమ ఆధీనంలో ఉందంటూ మరో వర్గం వాదులాడుకుంటున్న విషయం పాఠకులకు తెలిసిందే. దీనిపై ఈఓపీఆర్డీ శ్రీరామునాయుడు ఈనెల 12న విచారణకు వచ్చి ఎటూ తేల్చలేక ఉన్నతాధికార్ల దృష్టికి తీసుకువెళతానని చెప్పి వెళ్లిపోయారు. దీనిపై ఎంపీడీఓ సోమవారం విచారణ జరిపారు. ఇరువర్గాల మధ్య వాదనలు జరిగాయి. అయితే దీనిని సామరస్యంగా పరిష్కరించాల్సి ఉందని, అంతవరకు నిర్మాణాలు ఆపాలని ఆదేశించారు. విచారణలో రెడ్డి నగేష్, సర్పంచ్ చుక్క అనూరాధ, గొంప నరసింహనాయుడు, వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

న్యాయంపూడి సర్పంచ్‌కు సత్కారం



న్యాయంపూడి సర్పంచ్‌ను సత్కరిస్తున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి పంచాయతీకి జాతీయ స్థాయిలో అవార్డు రావడంతో సోమవారం సర్పంచ్ రెడ్డి వరహాలబాబును రాష్ట్ర కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఉద్దండపురం సర్పంచ్ పొడగట్ల వెంకటేశ్, పార్టీ నాయకులు పొడగట్ల పాపారావు సత్కరించారు. న్యాయంపూడికి సమృద్ధి నీటి సరఫరా విభాగంలో గుర్తింపు రావడం సంతోషంగా వుందని రామకృష్ణ అభిప్రాయపడ్డారు.

పౌష్టికాహారంపై అవగాహన

రాంబిల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలంకోడూరులో సోమవారం వీసీఎఫ్, టాటా ఏషియన్ పెయింట్స్ సహకారంతో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ప్రతినిధి ఎం.సౌజన్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం వంటల పోటీల విజేతలకు మండల వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, సర్పంచ్ గుణాకరరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ అనిత, పోషణ సఖీలు వై.రోజ, పి.సరోజిని పాల్గొన్నారు.

నేడు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ దినోత్సవం

ఎలమంచిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్జీఓహోమ్‌లో పెన్షనర్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు సంఘాధ్యక్షుడు సీహెచ్. సోమేశ్వరరావు తెలిపారు. ఎలమంచిలి తాలూకా యూనిట్ పరిధిలో సంఘ సభ్యులంతా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంఘ సభ్యులకు సన్మానాలు చేస్తామని ఆయన తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు



పాయకరావుపేటలో పాండురంగస్వామి అమ్మవార్లు

పాయకరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ధనుస్సంక్రమణం సందర్భంగా ఆండాళ్ళమ్మవారు, పాండురంగ స్వామివారిని నూతన వస్త్రాలు, సుగంధ ద్రవ్యాలు, పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాంచరాత్ర, వైఖానస ఆగమ శాస్త్ర సంప్రదాయంతో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 6.44 గంటలకు ఆలయ ప్రధానార్చకులు యి.కృష్ణస్వామి తీర్థబిందె, విశ్వక్సేనారాధన, భగవత్ పుణ్యాహవచనం, గంటఅర్చన, తిరుప్పావై, దివ్య ప్రబంధ పారాయణ, నివేదన, మంగళాశాసనం, సాత్ముర, ప్రథమపాసురసేవ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వికాసతరంగిణి సభ్యులు విష్ణుపారాయణం నిర్వహించగా.. మహిళా భక్తులు కోలాటం ఆడారు. ఆలయ ఈఓ కె.దివ్యతేజ, భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఎలమంచిలిలో..

ధనుర్మాస వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కావడంతో పట్టణంలోని ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. నెల రోజులు పాటు జరిగే ఈ ఉత్సవాల్లో వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి ప్రత్యేక పూజలను ప్రారంభించారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, త్రిమూర్తులు స్వామి ఆలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అదేవిధంగా ఏటికొప్పాక, పీఎస్ఆర్ పేట, పులపర్తి గ్రామాల్లో ధనుర్మాస వేడుకలను ఘనంగా ప్రారంభమయ్యాయి.

మునగపాకలో..

మండలంలో పలు వైష్ణవి ఆలయాల్లో సోమవారం ధనుర్మాసం పూజలు ప్రారంభమయ్యాయి. పలు రామాలయాల్లో వేకువజామున సీతారాములుకు ప్రత్యేక పూజలు, భజనలు చేశారు. మునగపాక రామాలయంలో అర్చకులు రాంబాబు, నాని పూజలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో పెతకంశెట్టి రామజోగినాయుడు, మళ్ల శేషు, ఆడారి సూర్యచంద్రరామారావు పాల్గొన్నారు. అలాగే మండలంలో పలు గ్రామాల్లో ఈనెల 17వ తేదీ నుంచి మేలుకొలుపులు మొదలుకానున్నాయి.

పూడిమడకలో చెత్తకు నిప్పు

▸▸ ఆంధ్రజ్యోతి ఎఫెక్టు



పూడిమడకలో చెత్తను ఎక్స్‌కవేటర్‌తో దగ్గరికి చేరుస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడకలో గుట్టలా పేరుకుపోయిన చెత్తను ఎక్స్‌కవేటర్‌తో ఒక చోటకి చేర్చి సోమవారం తగులబెట్టారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పూడిమడకలో చెత్త గుట్ట' శీర్షికతో వచ్చిన కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం పూడిమడక-లోవపాలెం రోడ్డులో గల భారీగా పేరుకుపోయిన చెత్తకు నిప్పు పెట్టి దహనం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చేపల సుభాషిణి మాట్లాడుతూ జిల్లాలో అతిపెద్ద మత్స్యకార గ్రామమైన పూడిమడకలో రోజుకు నాలుగు ట్రాక్టర్ల చెత్త వస్తోందన్నారు. ప్రతి రోజూ వచ్చే చెత్తను స్టోర్ చేయడానికి చాలా ఇబ్బంది అయ్యేదని, ఎక్కడ వేయాలో తెలియక అధికారుల్ని సంప్రదిస్తే మారికవలస వద్ద గల డంపింగ్ యార్డుకి తరలించమన్నారు. ఇక్కడ నుంచి ఒక లారీ చెత్తను అక్కడకు తరలించడానికి రోజుకి లారీ అద్దె సుమారు రూ. పది వేలు దాటుతుందని, ఇది సాధ్యం కాని పని అన్నారు. దీంతో పూడిమడక-లోవపాలెం రోడ్డులో గల స్థలంలో డంపింగ్ చేస్తున్నామన్నారు. ఇప్పటికి ఇక్కడ 70 నుంచి 80 టన్నుల వరకు చెత్త పోగై ఉందని, దీనిని దహనం చేశామన్నారు. పూడిమడకలో చెత్త సమస్యకు అధికారులే శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

నామమాత్రంగా ఉపాధి హామీ ప్రజా వేదిక

▸▸ అవినీతికి తావు లేకుండా చూడాలి : ప్రగడ

▸▸ వైసీపీ హయాంలో అన్నీ అవకతవకలే : సుందరపు



ఎలమంచిలి ఉపాధి ప్రజావేదికలో మాట్లాడుతున్న ఏపీ ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

ఎలమంచిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నామమాత్రంగా సాగింది. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు తావులేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. ఉపాధి హామీ సిబ్బంది ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకు వెళ్లాలన్నారు. ములకలాపల్లి ప్రాంతంలో ఇద్దరు వలంటీర్లకు నిబంధనలు విరుద్ధంగా మస్టర్లు వేసినట్టు తేలడంతో ఉన్నతాధికారులు లోతుగా విచారణ చేపట్టాలన్నారు. అనంతరంఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పథకాల్లో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. వీటిపై విచారణ జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆర్. పూర్ణిమదేవి, విజిలెన్స్ జిల్లా అధికారి నిర్మలాదేవి, ఎంపీడీఓ కేఎస్. కొండలరావు, ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ రాజాన శేషు, కూటమి నేతలు బొద్దపు శ్రీను, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, ఇత్తంశెట్టి రాజు, రాజాన నారాయణమ్మ, కరణం రవి, అన్నం బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ

మండలంలోని 17 పంచాయతీల్లోని 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో మండలంలో చేపట్టిన 709 పనులకు వేతన రూపంలో రూ. 7.97 కోట్లు, మెటీరియల్ రూపంలో రూ.1.6 కోట్లు అందజేశారు. ఈ మొత్తం పనులపై సామాజిక తనిఖీని నిర్వహించారు.

రిజిస్ట్రేషన్లు జరగకపోతే ఎలా ?

▸▸ 22ఏ రికార్డుల నుంచి తొలగించండి

▸▸ ఉపమాక సదస్సులో గ్రామస్థుల ఆవేదన



నక్కపల్లి : తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

నక్కపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ఉపమాక గ్రామ కంఠంలో వున్న పలు గృహాలు, స్థలాలను గత కొన్నేళ్లుగా 22ఏలో చేర్చడం వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని, రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్థులు ఆవేదన వెలిబుచ్చారు. సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఉపమాక సర్పంచ్ ప్రగడ వీరబాబు, దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి జగదీశ్వరరావు, తోలేటి శ్రీను, వాసు, జనసేన నాయకులు పాము గణేశ్, చంద్రరావు తదితరులు తహసీల్దార్ నర్సింహమూర్తికి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఎవరైనా ఆడపిల్లకు వివాహం చేయాలనుకుంటే స్థిరాస్తులు విక్రయించేందుకు అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 112 సర్వే నంబరులో వున్న గ్రామ కంఠాన్ని 22ఏలో పెట్టడం వల్ల, ఎవరికీ రిజిస్ట్రేషన్లు కావడం లేదన్నారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు.. అదేవిధంగా ఉపమాక గ్రామానికి సంబంధించి డంపింగ్ యార్డు కోసం 50 సెంట్లు కేటాయించాలని కోరారు.

రాంబిల్లిలో..

రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని లాలంకోడూరులో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూ సమస్యలను పరిష్కరించాలని రెవెన్యూ సిబ్బందికి అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ కశిరెడ్డి నర్సింగరావు, సర్పంచ్ గుణాకర్ రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని గోపాలపట్నం గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు జి. సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలించి, విచారించి 30 రోజులలో పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా 10 దరఖాస్తులను స్వీకరించారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ త్రినాథ్, వీఆర్ఓలు, సర్పంచ్ పస్పిరు పాపారావు, ఎంపీటీసీ సభ్యుడు కలిదిండి సతీష్‌రాజు , రైతులు పాల్గొన్నారు.

మునగపాకలో..

మండలంలోని గణపర్తిలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పది అర్జీలు స్వీకరించినట్టు డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు తెలిపారు. అన్ని రకాల భూ సమస్యలు పరిష్కారం లక్ష్యంగా ప్రభుత్వం సదస్సులను గ్రామస్థాయిలో నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రంలో సర్పంచ్ చదరం గణేష్‌నాయుడు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని గుడివాడలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో వివిధ సమస్యలకు సంబంధించి రైతుల నుంచి 23 వినతులు స్వీకరించినట్టు తహసీల్దార్ జె. రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు నల్లపురాజు వెంకటరాజు, నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాలొన్నారు.

ఏమిటీ కోతలు ?

▸▸ కూలి రేట్లు తగ్గించడం పట్ల వాహన బేరర్లు ఆవేదన



ఆలయ ఇన్‌స్పెక్టర్‌కు ఆలయ మాజీ చైర్మన్ బుజ్జి నేతృత్వంలో వినతిపత్రం అందజేస్తున్న వాహన బేరర్లు

నక్కపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో జరిగే పలు తిరువీధి సేవలు, ఊరేగింపులకు స్వామివారు, అమ్మవారి వాహనాలను మోసే వాహన బేరర్లు (బోగీలు)కు ఇచ్చే కనీస కూలి రేట్లను తగ్గించడం తగదని వాహన బేరర్లు పాసిలి వెంకటేశ్, అప్పారావు, పోలవరపు గోవింద్, కర్రి గురుమూజీ అన్నారు. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభమైన సమయంలో వాహనాలు మోసేందుకు తమకు ఇచ్చే రూ. 250లు కూలిని రూ. 200లకు తగ్గించినట్టు ఆలయ అధికారులు చెప్పడంతో విస్తుబోయామన్నారు. తాము వృత్తి, కూలి పనులు మానుకుని సేవలు వున్న రోజు స్వామివారి వాహనాలు మోస్తున్నామని, తమకు కూలి పెంచాల్సిన టీటీడీ అధికారులు తగ్గించడమేంటని వాపోయారు. విషయాన్ని ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జికి తెలియజేశారు. వాహన బేరర్లు కలిసి ఆయన ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. యథావిధిగా వాహనబేరర్లకు వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని హోం మంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని బుజ్జి వారికి హామీ ఇచ్చారు.

కూటమి ప్రభుత్వంలో భూ కబ్జాలకు తావులేదు

▸▸ ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి ఎం. శ్రీవేణి



మడుతూరు శ్మశాన వాటికను పరిశీలిస్తున్న అధికారులు

అచ్యుతాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో భూ కబ్జాలకు తావు లేదని ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేణి అన్నారు. మడుతూరు రుద్రభూమిలో సోమవారం అధికారులు సర్వే జరిపారు. రుద్రభూమిలో ఆక్రమణలు జరిగాయని శ్రీవేణి ఇటీవల జరిగిన జనవాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీఆర్వో సింహాచలం నాయుడు, సర్వేయర్ మౌనిక సోమవారం సర్వే నిర్వహించారు. ఇక్కడ రుద్రభూమి సర్వే నంబరు 293లో 5.57 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా అందులో ఎకరాన్నర భూమి ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. ఆక్రమిత స్థలంలో కొబ్బరి, అరటి తోటలతోపాటు పశువుల మేతకు ఉపయోగపడే గడ్డి ఉన్నట్టు గుర్తించారు. వీటి ఫల సాయాన్ని పంచాయతీకి దక్కాలని తీర్మానించారు. అలాగే రుద్రభూమి చుట్టు హద్దులు నిర్ణయించారు. అలాగే ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్లి రక్షణ గోడ ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతామని శ్రీవేణి తెలిపారు. కార్యక్రమంలో పాలసంఘం అధ్యక్షుడు శనివాడ ఆనందరావు, కార్యదర్శి బి.శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రదీప్, వీఆర్ఏలు అజయ్, రవి. బలిరెడ్డి పూర్ణ, పట్నాల రమేష్, ఎన్. దుర్గాప్రసాద్, ఎం. చింతలనాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయంలో సొంత వాహనానికి చార్జింగ్



విద్యుత్ స్కూటర్‌కి చార్జింగ్ పెట్టిన దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఆదా చేయడానికి చాలా మంది ఈవీ (ఎలక్ట్రిక్ వాహనాలు) వినియోగిస్తున్నారు. పెట్రోలు, డీజిల్ వాహనాలు కన్నా తక్కువ ఖర్చుతో ఎక్కువ మైలేజీ వస్తుందని చాలా మంది ఈవీలను వాడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఉద్యోగస్తులైతే ఈ వాహనాలపై కార్యాలయాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన తర్వాత వాహనాలకు తమ ఇళ్లతో చార్జింగ్ పెట్టుకుంటున్నారు. కానీ సోమవారం అచ్యుతాపురం ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద విద్యుత్ చార్జింగ్ పెట్టారు. అయితే ఈ వాహనం ఎవరిదో తెలియదు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ప్రధాన ద్వారానికి మాత్రం తాళాలు వేసి ఉన్నాయి. కానీ కిటికీ నుంచి మాత్రం ఈవీ స్కూటర్‌కి చార్జింగ్ పెట్టిన దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. ఎవరో గాని విద్యుత్ చార్జింగ్ భారం కూడా తమపై పడకుండా ప్రభుత్వ కార్యాలయం నుంచి వినియోగించడం విశేషం.

సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

మునగపాక, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న సీపీఎం 24వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వీవీ.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఇక్కడ గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సీపట్నంలో జరిగే మహాసభలకు ప్రజలు భారీగా తరలి రావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.బ్రహ్మాజీ, పెంటకోట సత్యనారాయణ పాల్గొన్నారు.

జానకయ్యపేట జన సైనికుల సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న జనసైనికులు

నక్కపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకయ్యపేట జనసైనికులు పుట్టెడు దుఃఖంలో వున్న కుటుంబాన్ని ఆదుకున్నారు. గ్రామానికి చెందిన జనసైనికుడు దూలి అప్పలరాజు ఇటీవల అకాల మరణం చెందడంతో జనసేన నాయకుడు కురందాసు అప్పలరాజు, తులసీరావు, మరికొందరు జనసైనికులు రూ.65,300 ఆర్థిక సాయాన్ని మృతుడు భార్యకు అందజేశారు. ఈ కుటుంబానికి ఏ కష్టం వచ్చినా అండగా వుంటామని, ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామని అప్పలరాజు చెప్పారు.

ఆయాల బకాయి వేతనాలు చెల్లించాలి



ఎలమంచిలి జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ ప్రతినిధులు

ఎలమంచిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తమకు బకాయి ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న శానిటరీ(ఆయా) కార్మికులు జిల్లా ఉప విద్యాధికారి కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. శివాజీ మాట్లాడుతూ పాఠశాలల్లో పనిచేస్తున్న కార్మికులకు 5 నెలలుగా వేతనాలు మంజూరు కాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలు డిమాండ్లతో వినతిపత్రాన్ని కార్యాలయ అధికారికి అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పి.జానకి, వరలక్ష్మి, శకుంతల పాల్గొన్నారు.

మునగపాకలో..

ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే మంజూరు చేయాలని మండల పాఠశాల, కళాశాలల శానిటేషన్ వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంఈవో బీఎస్.శివనాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయాలు పి.వెంకటలక్ష్మి, కె.లక్ష్మిలు మాట్లాడుతూ అరకొర వేతనాలతో కుటుంబ పోషణ గగనంగా మారుతోందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాలను దృష్టిలో పెట్టుకొని వేతనాలు పెంచాలని, ప్రతి నెల 5వ తేదీలోగా వాటిని మంజూరు చేయాలన్నారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో శానిటేషన్ కార్మికుల(ఆయాలు) వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సంబంధిత యూనియన్ నాయకురాలు ఉద్దండం నూకరత్నం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంఈవో కార్యాలయం ఎదుట పారిశుధ్య కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేతనాలు అందక కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

ఉపాధి కూలి సకాలంలో మంజూరు చేయాలి

ఎలమంచిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం కూలీలకు సకాలంలో కూలి మంజూరు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి శివాజీ, నాయకులు సోమవారం డ్వామా పీడీ ఆర్.పూర్ణిమదేవికి వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే అలవెన్సులు, సదుపాయాలు కల్పించాలని కోరారు. ఉపాధి కార్మికులకు పనులు జరిగే ప్రదేశాల్లో విధిగా తాగునీటి సదుపాయం, టెంట్లు, పనిముట్లకు నగదు, వేసవి అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు

కోటవురట్ల డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ, సచివాలయ కార్యదర్శులకు మంగళ, బుధవారాల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో జి. విశ్వనాథం తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు విధిగా హాజరుకావాలన్నారు. వీరికి అధికారులు శిక్షణ ఇస్తారన్నారు.

హాస్టళ్లలో మినీ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి

ఎలమంచిలి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మినీ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు తమ వంతు కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు సోమవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ ఎం.రమణ, సునీల్‌లు పాల్గొన్నారు.

అర్జీలకు చక్కని పరిష్కారం

▸ అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్.., చిత్రంలో జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను సమర్పించిన వారు సంతృప్తి చెందే విధంగా అధికార యంత్రాంగం సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఇక్కడి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆమె జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీ అందిన వెంటనే క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం సంబంధిత అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సదరు సమస్యకు చక్కని పరిష్కారం చూపాలన్నారు. ఈ వేదికకు వచ్చే అర్జీలపై మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆయా అధికారులు వారి శాఖలకు సంబంధించి అందిన అర్జీల పరిష్కార విషయంలో సిబ్బందితో రోజువారీ సమీక్షలు నిర్వహించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పీజీఆర్ఎస్ ముగిసే సరికి 193 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు.



అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్ : అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలపై అందే అర్జీలకు అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. ఇదిలావుంటే, పీజీఆర్ఎస్ కార్యక్రమం ముగిసే సరికి 35 అర్జీలు అందాయి. వీటిలో భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు తదితరాలకు సంబంధించి ఉన్నాయని పోలీస్ విభాగాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ



హెల్మెట్లు ధరించి ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరుతూ ట్రాఫిక్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. తొలుత అనకాపల్లి డీఎస్పీ శ్రావణి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎన్టీఆర్ మార్కెట్ యార్డు నుంచి మెయిన్‌రోడ్డు, పెరుగుబజార్ జంక్షన్, ఎన్టీఆర్ జంక్షన్, నెహ్రూచౌక్, ఆర్టీసీ కాంప్లెక్స్, శారదానగర్ మీదుగా తిరిగి నెహ్రూచౌక్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. హెల్మెట్ ధరించనివారి లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ట్రాఫిక్, మహిళా పోలీస్, సీసీఎస్, అనకాపల్లి పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

కుంచావారి గౌరమ్మకు సారె సమర్పణ



సారెను తలపై పెట్టుకుని ఆలయానికి విచ్చేసిన మహిళలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి మెయిన్ రోడ్డులోని కుంచావారి గౌరీ పరమేశ్వరులకు సోమవారం రాత్రి అత్యంత భక్తిశ్రద్ధలతో సారెను సమర్పించారు. ఆలయ పరిసరాల్లోని మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన వివిధ రకాల పిండి వంటలతో పాటు పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, అరటి పండ్లు తదితరాలను పళ్లేల్లో పేర్చి పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎం.వీరభద్రరావు, కమిటీ ప్రతినిధులు కుంచావారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మర్లమాంబ ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ ప్రహరీ నిర్మాణానికి భూమి పూజలో పాల్గొన్న ఎంపీపీ, తదితరులు

సబ్బవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు కొత్తరోడ్డు వద్ద మర్లమాంబ ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ బోకం సూర్యకుమారి సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుంచి రూ.ఐదు లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఎంపీటీసీలు వీరప్ప శ్రీను, బైలపూడి దేముడుబాబు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, వార్డు మెంబర్లు పోతల కనకరాజు, గొర్లి శ్రీనివాస్, బోకం రామకృష్ణ, కేవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణ ఆలయంలో చోరీకి విఫలయత్నం



దేవస్థానం ప్రధాన తలుపులు పగులగొట్టిన దృశ్యం

కొత్తూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీలో ఉన్న సత్యనారాయణస్వామి దేవస్థానంలో చోరీకి దుండగులు యత్నించారు. దీనిపై దేవస్థానం చైర్మన్ అప్పికొంగ గణేష్ సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి 1.30 సమయంలో సత్యనారాయణస్వామి దేవస్థానం తలుపులను పగులగొట్టేందుకు గుర్తు తెలియని దుండగులు ప్రయత్నించారని ఆరోపించారు. అది సాధ్యం కాకపోవడంతో అక్కడే ఉన్న సీసీ కెమెరాను దొంగిలించుకుపోయినట్టు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాల్సిందిగా కోరారు.

'మోటారు వాహన కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి'

కొత్తూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు, మోటార్ వాహన కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. సోమవారం ఇక్కడ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్న విషయాన్ని గుర్తు చేశారు. ఆటో డ్రైవర్లకు వాహనమిత్ర వెంటనే అమలు చేయాలని, జీవో నెంబరు 21, 31 రద్దు చేయాలని, డీజిల్, పెట్రోల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తగ్గించాలని కోరారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్న ఆర్టీవో, పోలీసు ఈ- చలానాల రద్దుతో పాటు సమస్యలన్నీ పరిష్కరించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోరిబిల్లి జగదీష్, నేతలు డి.మాణిక్యం, చేపల నానాజీ, కరణం అప్పారావు, గాడి ప్రసాద్, మొల్లి లోవరాజు, మహేష్ పాల్గొన్నారు.

మొగలిపురంలో 276 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు జరుపుతున్న డాక్టర్ల బృందం

సబ్బవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగలిపురంలో పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జి గండి బాబ్జీ, గండి వంశీదీప్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వివిధ గ్రామాల నుంచి 276 మంది విచ్చేయగా, గీతం హాస్పిటల్స్ సిబ్బంది పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. గీతం వైద్యులు డాక్టర్ ఉదయ్‌కుమార్, అజ్మల్, కశిఫా, భవ్య, శ్రీనివాస్, యసివర్మ, గ్రామ పెద్దలు బంగారునాయుడు, నానాజీ, సత్యం, నరేష్, సత్యనారాయణ, రాము, రాజు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి నర్సీపట్నంలో సీపీఎం జిల్లా మహాసభలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సీపీఎం అనకాపల్లి జిల్లా 24వ మహాసభలు ఈ నెల 21, 22 తేదీల్లో నర్సీపట్నంలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. సోమవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని ఆరోపించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు బి.ప్రభావతి, జి.కోటేశ్వరరావు, ఎం.అప్పలరాజు, డి.వెంకన్న, గంటా శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం : ఎమ్మెల్యే కొణతాల



సాగునీటి సంఘాల సభ్యులను సత్కార సభలో రామకృష్ణ, పీలా గోవింద

కొత్తూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సుజల స్రవంతి ప్రాజెక్టును పూర్తి చేసి, గోదావరి నీటిని తీసుకువచ్చి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘాల సభ్యులకు అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డులో గల జనసేన కార్యాలయంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సాగు నీటి కాలువలు, చెరువులు, గ్రోయిన్లు, మరమ్మతులకు రూ.ఆరు కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నామన్నారు. వైసీపీ హయాంలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే పీలా మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 23 సాగు నీటి సంఘాల సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పే అవకాశమే లభించేది కాదు

▸ నాడు డీఏను కాగితాలపై చూపితే.. నేటి సర్కారు నగదు చెల్లించింది ▸ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ



కూండ్రం హైస్కూల్ వద్ద ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

కొత్తూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమ్యలను కూటమి ప్రభుత్వం విని పరిశీలన చేస్తోందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ తెలిపారు. అనకాపల్లి మండలంలోని ఏఎంఏఎల్ హైస్కూల్, కూండ్రం, తుమ్మపాల, మామిడిపాలెం, మార్టూరు, దిబ్బపాలెం తదితర పాఠశాలలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పడానికి అవకాశమే లభించేది కాదన్నారు. గత పాలకులు పట్టించుకోకపోయినా మండలి వేదికగా సమస్యలపై ప్రశ్నించామని వివరించారు. విద్యా వ్యవస్థ నాశనానికే పుట్టిన జీవో 117ను అందరూ వ్యతిరేకించినా కొందరు తందాన తానకొట్టారన్నారు. ప్రవీణ్‌ప్రకాశ్‌పై పోరాటాన్ని ఢిల్లీ స్థాయికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఆయనను తరిమికొట్టగలిగామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీకి జీతాలు ఇవ్వాలన్న తమ విన్నపాన్ని ప్రభుత్వం పరిశీలించి, అందుకు అనుగుణంగా కృషి చేస్తోందన్నారు. గత ప్రభుత్వం కాగితంపై మాత్రమే డీఏను చూపితే, కూటమి ప్రభుత్వం నగదును చెల్లించిందన్నారు. ఇప్పటికీ కొందరు అధికారులు ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించే విధంగా సమయపాలన పెంపు, సెలవుల్లోనూ వంద రోజుల ప్రణాళిక తదితర అంశాలను తెరపైకి తీసుకు వస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తున్నట్టు చెప్పారు. ఆయన వెంట ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిరికి దుర్గాప్రసాద్, మండల కార్యదర్శి కొణతాల గణేష్, జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాస్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుతు సన్యాసినాయుడు, శివాజీ, జగదీష్, కన్నారావు, కిరీటి అప్పలరాజు, వై. సత్యం తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిల కోసం ఆందోళన

▸ ఆర్డీవో, డీఈవో కార్యాలయాల్లో శానిటేషన్ సిబ్బంది వినతులు



ఆర్డీవో కార్యాలయ ఏవోకు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ సోమవారం ఇక్కడ వారంతా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కరోనా సమయంలో కూడా ప్రాణాలను పణంగా పెట్టి సదరు కార్మికులు పని చేశారన్నారు. అయినప్పటికీ కనీస వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో దశాబ్దాలుగా శానిటేషన్ సిబ్బంది తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, బకాయి పడ్డ ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఆయన కోరారు. అలాగే వీరికి అవసరమైన పనిముట్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాదబీమా సౌకర్యం, ఈఎస్ఐ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో, డీఈవో కార్యాలయాలకు వెళ్లి వినతిపత్రాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు యర్రంశెట్టి లక్ష్మి, వడ్డాది రూపావతి, యర్రంశెట్టి హారిక, నిమ్మకాయల నూకరత్నం, బొమ్మాల తులసీ తదితరులు పాల్గొన్నారు.

'అడ్డంకులను సమర్థంగా ఎదుర్కోవాలి'



సుమన్‌కు జ్ఞాపిక అందిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో అడ్డంకులను ఎదుర్కొనేందుకు ఎల్లప్పుడూ సన్నద్ధంగా ఉండాలని ప్రముఖ హీరో సుమన్ అన్నారు. స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తల్లి, తండ్రి, గురువు ప్రత్యక్ష దైవాలన్నారు. తన జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లను, వాటిని అధిగమించిన విధానాన్ని వివరించారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ సినీ రంగంలో, కరాటే రంగంలో హీరో సుమన్ అందించిన సేవలను కొనియాడారు. అనంతరం వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన కళాశాల విద్యార్థులను సుమన్ చేతుల మీదుగా సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు

టెన్త్ విద్యార్థుల కోసం మోడల్ టెస్టు పేపర్లు

▸ ఆవిష్కరించిన డీఈవో అప్పారావునాయుడు



మోడల్ టెస్ట్ పేపర్లను ఆవిష్కరిస్తున్న డీఈవోఅప్పారావునాయుడు

అనకాపల్లి రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ తయారు చేసిన పదవ తరగతి మోడల్ టెస్ట్ పేపర్లను సోమవారం సాయంత్రం ఇక్కడ జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకంలో ఏడు సబ్జెక్టులకు చెందిన ముఖ్యమైన ప్రశ్నల సారాంశం ఉన్నట్టు చెప్పారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి మాట్లాడుతూ గత సంవత్సరం యూటీఎఫ్ రూపొందించిన మోడల్ పేపర్లు చదివిన విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కులు సాధించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రమాజ్యోతి, ఏఎస్‌వో వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ ప్రతినిధులు వాత్సాయి శ్రీలక్ష్మి, రొంగలి అక్కునాయుడు, మాకిరెడ్డి రాజనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో గాంధీనగరం వెంకన్న

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (అంధ్రజ్యోతి) : ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. పట్టణంలోని దేమునిగుమ్మం, గాంధీనగరం వెంకటేశ్వరస్వామి తదితర ఆలయాల్లో ఈ వేడుకలకు సోమవారం ఉదయం పది గంటల సమయంలో నెల గంట కొట్టి అర్చకులు శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

కళాశాలలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపకులు ఆళ్ల ప్రవీణ్ కుమార్, సమైక్యత డెవలప్‌మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు ఎస్.రాజశేఖర్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, ఎస్.చంద్రశేఖర్, రమణ, గిలకల అప్పారావు, రేబాక మధు, దొడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

రిక్షా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



రిక్షా కార్మికులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న దృశ్యం

కొత్తూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద రిక్షా కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని రిక్షా కార్మిక సంఘం కన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. రిక్షా కార్మికులతో సోమవారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. సంఘాల నిర్మాణం ద్వారా కార్మికులు బలోపేతం కావాలన్నారు. అనంతరం గుర్తింపు కార్డులు అందజేశారు. జిల్లా రిక్షా కార్మికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గురుంపల్లి వెంకటరావు, కార్యదర్శి నీలకంఠం, కోశాధికారి నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైబ్రాంట్ డైట్ ఫెస్ట్-2కె 25 పోస్టర్ విడుదల

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో వైబ్రాంట్ డైట్ ఫెస్ట్-2కె 25 పోస్టర్‌ను సోమవారం కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి ఆరు, ఏడు తేదీల్లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులకు ఆటల పోటీలు, వినోదం, సాంస్కృతిక నృత్యాలు, సాంకేతిక కార్యక్రమాలు వంటివి నిర్వహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గణేష్ ప్రసాద్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

డ్రైనేజీలు శుభ్రపరచాలని ఆందోళన

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : భీమునిగుమ్మం వద్ద డ్రైనేజీని శుభ్రపర్చకపోవడం వల్ల దుర్వాసన, దోమల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్టు స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ కన్వీనర్ కొణతాల హరినాథబాబు సోమవారం సదరు ప్రాంతాన్ని పరిశీలించి మహిళలతో మాట్లాడారు. నెల రోజులుగా కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం తొలగించడం లేదని వారు ఆరోపించారు. ఈ సమసయపై జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించాల్సిందిగా కోరారు.

22 మద్యం క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం

కశింకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌జీ పాలెంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. కొటారి రామచంద్రరావు అనే వ్యక్తి గ్రామంలో బెల్టు షాపు ద్వారా మద్యం విక్రయాలు చేస్తున్నట్టు అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకున్నట్టు చెప్పారు. 22 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



సబ్బవరం : నంగినారపాడు సభలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

తుమ్మపాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. తుమ్మపాలలో సోమవారం నిర్వహించిన సదస్సుకు హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ పాలనలో భూ సమస్యలు అధికమయ్యాయన్నారు. దీంతో పలువురు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. కూటమి పాలనలో భూ కబ్జాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అనంతరం పలువురు అర్జీదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, ఆడారి గోవిందరావు, కర్రి బాబి, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నంగినారపాడులో...

సబ్బవరం : జీవీఎంసీ 88వ వార్డు నంగినారపాడులో రెవెన్యూ అధికారులు సోమవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ బి.చిన్నికృష్ణ రైతుల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ గణపతిరావు, వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందలి వెంకటరమణ, సర్వేయర్లు లోకేశ్, రాంబాబు, వీఆర్వోలు వినోద్, గోవింద, గ్రామ పెద్దలు బి.సూరిదేముడు, శెట్టి అప్పారావు, కల్లేపల్లి శంకర్, బి.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు

మంత్రిపాలెంలో...



పరవాడ : మంత్రిపాలెం రెవెన్యూ సదస్సులో...

పరవాడ : రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని తహసీల్దార్ ఎస్వీ అంబేడ్కర్ తెలిపారు. మంత్రిపాలెంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. అపరిష్కృత సమస్యలు పరిష్కరించేందుకు గాను ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందన్నారు. సమస్యలపై దరఖాస్తు చేసుకుంటే 45 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. అనంతరం వివిధ సమస్యలపై 27 మంది దరఖాస్తులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, వీఆర్వో జి.వెంకటరమణ, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'కాఫీ పల్పింగ్ లక్ష్య సాధనకు మ్యాక్స్ కృషి చేయాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో వెంకటేశ్వరరావు

చింతపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):కాఫీ పల్పింగ్ లక్ష్య సాధనకు మ్యాక్స్ కృషి చేయాలని పాడేరు ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఎకో పల్పింగ్ యూనిట్‌ని సందర్శించిన ఆయన మ్యాక్స్ ప్రతినిధులు, లైజన్‌వర్కర్లతో సమావేశమయ్యారు. ఈ ఏడాది ఏజెన్సీలో రెండు వేల మెట్రిక్ టన్నుల కాఫీ పండ్లను పల్పింగ్ చేయాలని లక్ష్యంగా చేసుకోవడం జరిగిందన్నారు. నవంబరులో పల్పింగ్ ప్రారంభించినప్పటికి నేటి వరకు కేవలం 250 టన్నులు మాత్రమే పల్పింగ్ జరిగిందన్నారు. కాఫీ గింజలు విక్రయించగా వచ్చిన ఆదాయం నుంచి రైతులకు బోనస్ అందజేస్తామన్నారు. ఈ విషయాన్ని కాఫీ రైతులకు లైజన్ వర్కర్లు, మ్యాక్స్ డైరెక్టర్లు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కాఫీ ప్రాజెక్టు ఏడీ ఇన్‌చార్జి అప్పలనాయుడు, మ్యాక్స్ చైర్మన్ కొండలరావు పాల్గొన్నారు.

'నీటి సమస్య పరిష్కారానికి కృషి'


బోరు నిర్మాణానికి భూమి పూజ చేసిన శివరత్నం

గూడెంకొత్తవీధి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్లు నిర్మిస్తున్నామని స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం తెలిపారు. సోమవారం దామనాపల్లిలో జడ్పీ నిధులతో వేస్తున్న బోరు నిర్మాణ పనులను ఆమె ఎంపీపీ బోయిన కుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివరత్నం మాట్లాడుతూ దామనాపల్లిలో నాలుగు బోర్లు నిర్మిస్తున్నామన్నారు. తాగునీరు అవసరమైన గ్రామాలను గుర్తించి బోర్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుందరి రామకృష్ణ, వైసీపీ మండలాధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, ఉప సర్పంచ్ చిలమ్మ పాల్గొన్నారు.

నాలుగు పంచాయతీల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు

చింతపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు పంచాయతీల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీడీవో యూఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు అన్నవరం, చౌడుపల్లి-2, కొత్తపాలెం-2, తమ్మంగుల పంచాయతీల్లో ఆధార్ సేవా కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఐదేళ్లలోపు చిన్నారుల ఆధార్ నమోదు, ఆధార్ నవీకరణలు చేసుకోవచ్చునన్నారు.

19న జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో జాబ్ మేళా

పాడేరురూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 4 కంపెనీలతో స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్‌లో జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిని డాక్టర్.పి.రోహిణి తెలిపారు. ఈ జాబ్ మేళాలో రుద్ర కో-ఆపరేటివ్ సర్వీస్, డెలివరీ, ఎన్ఎస్ ఇనుస్ట్రుమెంట్, ఎయిర్‌టెల్ ప్రేమెంట్స్ బ్యాంక్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. జిల్లాలోని 18 నుంచి 30 ఏళ్ల వయస్సు లోపు గల 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ఆపై విద్యను అభ్యసించిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు పాన్‌కార్డు, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ కాపీలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 6302636174, 9398338105 ఫోన్ నంబర్లకు సంప్రదించాలన్నారు.

పెంటలగెడ్డలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీలేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధిలోని పెంటలగెడ్డలో సీసీ రోడ్డు పనులను సోమవారం స్థానిక సర్పంచ్ నడిగట్ల రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలో 100 మీటర్ల సీసీ రోడ్డు వేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మాడి రామన్న, కూటమి నాయకుడు పోతురాజు కృష్ణ పాల్గొన్నారు.

నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన

సీలేరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ మోటార్ అసోసియేషన్ సభ్యులకు నిబంధనలపై సీలేరు ఎస్ఐ రవీంద్ర సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా లైసెన్సులను కలిగి ఉండాలన్నారు. ప్రతీ వాహనానికి ఆర్‌సీ, ఇన్సూరెన్సు, పొల్యూషన్, తప్పనిసరిగా ఉండాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కించుకోరాదని సూచించారు. అలాగే ఆటోలు, ఇతర వాహనాల్లో గంజాయి వంటి వాటిని రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు.

వసతిగృహాలు నిర్మించాలని ఆందోళన



మండల పరిషత్ కార్యాలయం ఎదుట బైఠాయించిన విద్యార్థులు

అనంతగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వసతి గృహాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ శ్రీను, కార్యదర్శి జీవన్‌కృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. వసతి గృహాలు లేకపోవడంతో విద్యార్థులు రూమ్‌లను అద్దెకు తీసుకుని చదువుకుంటున్నారని, ఆశ్రమ పాఠశాలలోని హెల్త్ వర్కర్లు లేకపోవడంతో మరణాలు సంభవిస్తున్నాయని వేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను పరిష్కరించడంతో పాటు విద్యార్థులకు మెస్‌చార్జీలను పెంచాలని ఆయన విన్నవించారు.

విద్యార్థినులకు సౌకర్యాల కల్పనకు కృషి

▸▸ మండల అధ్యక్షురాలు శెట్టి నీలవేణి

అనంతగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని ఎంపీపీ శెట్టి నీలవేణి చెప్పారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల-1 పాఠశాలను సోమవారం ఎంపీడీవో ఏవీవీ.కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థినులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాలలో సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. అలాగే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థినులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు బోధన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం విమలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

▸▸ జీసీసీకే కాఫీ గింజలు విక్రయించాలి

▸▸ సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్


సుంకరమెట్ట సమీపంలో కాఫీ తోటల దిగుబడిని పరిశీలిస్తున్న చైర్మన్ శ్రావణ్

అరకులోయ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులు దళారులను నమ్మి మోసపోకూడదని, కాఫీ గింజలను జీసీసీకే విక్రయించాలని సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ సూచించారు. సోమవారం అరకులోయ పర్యటనకు విచ్చేసిన ఆయన, ఘాట్‌రోడ్డులోని ప్రధాన మార్గం పక్కనే ఉన్న కాఫీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి దిగుబడుల గురించి అడిగి తెలుసుకున్నారు. బీసుపురం, సుంకరమెట్ట సమీపంలో రైతులకు చెందిన కాఫీతోటలను పరిశీలించారు. ప్రతీ గిరిజన రైతు తప్పనిసరిగా కాఫీ గింజలను జీసీసీకే విక్రయించాలని రైతులకు కిడారి సూచించారు. జీసీసీ చెల్లించేంత రేటు ఎవరూ ఇవ్వడం లేదని, ఈ విషయం రైతులు గుర్తించాలని సూచించారు. అలాగే జీసీసీకి విక్రయించే కాఫీ రైతులకు రుణాలను సైతం జీసీసీ మంజూరు చేస్తుందన్నారు. చైర్మన్ వెంట ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, బాకూరు, అండిబ, శోభకోట సర్పంచులు బాకూరి వెంకటరమణరాజు, తామర్ల సత్యనారాయణ, శశిభూషణ్‌నాయుడు, రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సాగర సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జి త్రినాథ్, అరకు ఆర్గనైజింగ్ కార్యదర్శి ధన్నేరావు ఉన్నారు.

ఆర్గానిక్ మేళాలో ఆదివాసీ రైతుకు సత్కారం

▸▸ ఉత్తమ మార్కెటింగ్ రైతుగా కామరాజుకు గుర్తింపు


ఆదివాసీ రైతు కామరాజును సత్కరిస్తున్న ఉన్నతాధికారులు

పాడేరు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఈనెల 12 నుంచి 15 తేదీ వరకు జరిగిన ఆర్గానిక్ మేళాలో మన్యానికి చెందిన ఆదివాసీ రైతు కొర్రా కామరాజుకు ఉన్నతాధికారులు సత్కరించారు. ఈ మేళాలో గిరిజన ప్రాంతంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలతో అరకులోయ మండలం చొంపి గ్రామానికి చెందిన ఆదివాసీ రైతు కొర్రా కామరాజు ఓ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆస్టాల్‌కు మంచి ఆదరణ లభించింది. దీంతో ఆదివాసీ రైతు కొర్రా కామరాజును ఉత్తమ మార్కెటింగ్ రైతుగా గుర్తించి ఆదివారం రాత్రి ఏపీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ చిరంజీవి, ఏపీ రైతు సాధికారత సంస్థ రాష్ట్ర అధికారులు మహ్మద్‌దివాన్ మైదీన్, టి.విజయకుమార్, బి.ప్రభాకర్, తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అల్లూరి సీతారామరాజు జిల్లా డీపీఎం ఎల్.భాస్కరరావు, మార్కెటింగ్ అధికారులు భాను, సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్


హంసా ఆత్మీయ సభలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు అరవపాల్

పాడేరురూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోషియేషన్ (ఏపీ హంస) రాష్ట్రాధ్యక్షుడు అరవపాల్ పిలుపునిచ్చారు. అసోసియేషన్ పాడేరు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఆత్మీయ సభలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి వైద్య సిబ్బందికి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను పోరాడి సాధించుకోవాలన్నారు. జిల్లాలోని మారేడుమిల్లు పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్ఎం ఎల్.ప్రభావతి ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భవిష్యత్‌లో వైద్య ఉద్యోగులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం తొలగించి హెల్త్ అసిస్టెట్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులతో చర్చలు జరపనున్నామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, పిచ్చయ్య, శ్రీనివాసరావు, పాడేరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు నడిగట్ల ప్రకాశరావు, అసోషియేట్ అధ్యక్షుడు గుల్లెలి సింహాద్రి, జనరల్ సెక్రటరీ కె.సుబ్రమణ్యం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని పీవోకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వినతి


పీవో అభిషేక్‌కు వినతిపత్రం అందిస్తున్న గిరిజన గురుకుల ఉద్యోగులు

పాడేరురూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గురుకుల విద్యాలయాలలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగ సంఘ నాయకులు రత్నాకర్, కొండబాబు, వెంకటేశ్వర్లు సోమవారం ఐటీడీఏ పీవో వి.అభిషేక్‌కు వినతిపత్రం అందించారు. తమ న్యాయమైన డిమాండ్ పరిష్కారం కోరుతూ 32 రోజులుగా దీక్షలు చేపట్టినా జిల్లా అధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టక పోవడం బాధాకరమన్నారు. దీనిపై స్పందించిన పీవో అభిషేక్ మాట్లాడుతూ జీవో నంబరు 7లో మీరు ఏ కేటగిరిలో లేనందున మీకు న్యాయం జరగడం లేదన్నారు. సోషల్ వెల్ఫేర్‌లో ఏ విధంగా వేతనాలు చెల్లిస్తున్నారో ఆ జీవో ప్రకారం జీతాలు చెల్లించాలని ఈ రోజే ట్రైబల్ వెల్ఫేర్ డైరెక్టర్, గురుకులం ప్రిన్సిపల్ సెక్రటరీకి, అధికారులకు లేఖలు రాస్తానని పీవో తెలిపారని వారు పేర్కొన్నారు. ఈ సమస్యను మంగళవారం విశాఖపట్నం వస్తున్న డైరెక్టర్‌తో స్వయంగా మాట్లాడతానని పీవో హామీ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శేఖర్, సురేష్, భవానీ, లక్ష్మి, హేమ, చంద్రకళ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణ నిధులు తక్షణమే విడుదల చేయాలి

▸▸ ఆలయ కమిటీ చైర్మన్‌లు, అర్చకులు డిమాండ్


ఐటీడీఏ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఆలయ చైర్మన్‌లు, అర్చకులు

పాడేరురూరల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల్లో నిర్మాణాలు జరుగుతున్న ఆలయాలకు టీటీడీ మంజూరు చేసిన నిధులను జిల్లా దేవదాయ, ధర్మాదాయ శాఖాధికారులు వెంటనే విడుదల చేయాలని కోరుతూ ఆలయ కమిటీల చైర్మన్‌లు నందోలి కొండబాబు, కొర్రా రాంబాబు తదితరులు సోమవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో ఆంజనేయస్వామి, రామాలయం, వెంకటేశ్వరస్వామి తదితర ఆలయాలు నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ రెండు నెలలుగా వాటిని విడుదల చేయడం లేదన్నారు. మన్యంలో ఒక్కొక్క ఆలయ నిర్మాణానికి రూ. 10 లక్షల చొప్పున 180 ఆలయాల నిర్మాణానికి తొలి విడతగా నిధులు మంజూరు చేశారన్నారు. దేవదాయ శాఖ అధికారులు స్పందించి నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాడేరు డివిజన్‌లోని 64 మంది ఆలయ కమిటీ చైర్మన్‌లు, అర్చకులు ఆర్.అప్పారావు, వి.సుభాష్, ఎం.బసవన్న, కె.రమ, ఎస్.అప్పారావు, కె.శ్రీనివాస్, టి.మత్స్యలింగం, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 48 ఫిర్యాదులు

▸▸ తహసీల్దార్ త్రినాథరావు నాయుడు



మినుములూరులో వినతులు స్వీకరిస్తున్న తహసీల్దార్ త్రినాథరావునాయుడు

పాడేరురూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు కోరారు. సోమవారం మండలంలోని మినుములూరు సచివాలయం, వంట్లమామిడి సచివాలయం పరిధిలోని మోదాపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆయన మాట్లాడారు. ప్రజలు అందించిన భూ సమస్యల అన్నింటికీ పరిష్కార మార్గం చూపిస్తామన్నారు. ఈ సందర్భంగా మినుమూలూరులో 38, మోదాపల్లిలో 10 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో మినుములూరు, వంట్లమామిడి సర్పంచులు లంకెల చిట్టమ్మ, కొర్రా మంగమ్మ, ఉప సర్పంచ్ సూరిబాబు, మాజీ సర్పంచ్ పాలికి లక్కు, డీటీలు పి.పోలురాజు, కె.లక్ష్మణమూర్తి, మండల సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

కొయ్యూరులో..

మండలంలోని కొయ్యూరులో సోమవారం రెవెన్యూ సదస్సును తహసీల్దారు ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సదస్సులో వివిధ సమస్యలపై 168 వినతులను స్వీకరించారు. వాటిలో రెండు ఆర్‌వోఎఫ్ఆర్ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీటీ స్వామి, ఆర్ఐ, అటవీ, రెవెన్యూ అధికారులు, సర్పంచ్ బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలుచేయాలి: ఎంఈవో


పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈవో క్రిష్ణమూర్తి

ముంచంగిపుట్టు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకం మెనూ పక్కాగా అమలు చేయాలని ఎంఈవో క్రిష్ణమూర్తి ఆదేశించారు. మండలంలోని మారుమూల లబ్బూరు స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో కెందుపుట్టు, లబడపుట్టు, అలబీరు తదితర పాఠశాలలను సోమవారం ఎంఈవో ఆకస్మికంగా సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానని ఎంఈవో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ హరి, మెస్సెంజర్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి: సీఐ

పెదబయలు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించి సురక్షితమైన ప్రయాణం చేయాలని జి.మాడుగుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. సోమవారం వారపు సంతకు వచ్చిన మారుమూల గ్రామాలకు చెందిన జీపు, ఆటో డ్రైవర్లతో ప్రత్యేకంగా సమావేశయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అధిక వేగం, పరిమితికి మించిన లోడు, మద్యం తాగి వాహనాలు నడపడం, ఓవర్ టేక్ చేయడం తదితర కారణాల వల్ల అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. మారుమూల గ్రామాలలో పాసింజర్ వాహనాల కొరత వల్ల ఒకే వాహనంలో పరిమితి మించిన ప్రయాణికులతో రాకపోకలు సాగిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెంట్‌ను ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెదబయలు ఎస్ఐ కొల్లి రమణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


వారపు సంతలో వాహన చోదకులతో మాట్లాడుతున్న సీఐ

బాలరేవులకు బస్సు సౌకర్యం కల్పించండి


దొన్నుదొరకు వినతిపత్రాన్ని ఇస్తున్న బూదరాళ్ల సర్పంచ్, వార్డు మెంబర్లు

కొయ్యూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) బూదరాళ్ల పంచాయతీలో 30 గ్రామాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న బాలరేవులకు బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్‌టీసీ జోనల్ చైర్మన్ దొన్నుదొరను కోరినట్టు సర్పంచ్ సర్పంచ్ ముత్యాలమ్మ, వార్డు సభ్యుడు సంజీవ్ తెలిపారు. సోమవారం అరకులోయలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దొన్నుదొరను సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. దీనిపై దొన్నుదొర సానుకూలంగా స్పందించారని, త్వరలో బాలరేవులకు బస్సు సౌకర్యం కల్పించేం దుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

17 శాతం తేమ మించకుండా ధాన్యాన్ని తీసుకురావాలి

కొయ్యూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రానికి 17 శాతం తేమ మించకుండా ఉన్న ధాన్యాన్ని తీసుకురావాలని మండల వ్యవసాయశాఖాధికారిణి ఉమాదేవి సూచించారు. సోమవారం శరభన్నపాలెం రైతు సేవ కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనలను రైతులు విధిగా పాటించాలన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన మేరకు క్వింటా ధాన్యం రూ. 2300 కొనుగోలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవోలు సత్తిబాబు, మాధవి పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి కోతలు


చీడిపల్లి పరిసరాలలో వరి కోతలు కోస్తున్న రైతులు

కొయ్యూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాతావరణం మార్పుతో బూదరాళ్ల పంచాయతీలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు పడే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గడిచిన పది రోజులుగా వరి కోతలను రైతులు నిలిపివేశారు. సోమవారం నుంచి ఎండ కాయడంతో రైతులు వరి కోతలకు ఉపక్రమించారు. ఒకేసారి కోతలు ప్రారంభం కావడంతో కూలీల కొరత ఏర్పడింది.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

చింతపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో యూఎస్వీ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో 15వ సామాజిక తనిఖీపై ఉపాధి హామీ పథకం క్షేత్ర స్థాయి ఉద్యోగులు, సామాజిక తనిఖీ బృందంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2023-24 వార్షిక సంవత్సరంలో జరిగిన రూ.6,35,41,594 పనులకు సంబంధించి సామాజిక తనిఖీ నిర్వహించడం జరుగుతుందన్నారు. సామాజిక తనిఖీ బృందం నివేదిక ఆధారంగా ప్రజా వేదిక నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ లోకేశ్, పీఆర్ ఏఈ బాలకిశోర్ పాల్గొన్నారు.

ఆడాకుల గ్రామసభకు ఆదివాసీలు తరలిరావాలి


విలేకరులతో మాట్లాడుతున్న రాజబాబు

గూడెంకొత్తవీధి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు మండలం ఆడాకుల గ్రామంలో ఈనెల 19వ తేదీన నిర్వహించే గ్రామసభకు గిరిజనులు హాజరుకావాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ మొట్టడం రాజబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆడాకుల గ్రామంలో పీసా గ్రామ సభను అధికారులు ఏర్పాటు చేస్తున్నారన్నారు. గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ఈ గ్రామ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఆదివాసీ హక్కులు, చట్టాలకు విఘాతం కలిగించే చర్యలను ఆదిలోనే అడ్డుకోవాలన్నారు. ఈగ్రామ సభకు పెద్ద సంఖ్యలో ఆదివాసీలు హాజరై తమ గొంతును వినిపించాలన్నారు. విలేకర్ల సమావేశంలో ఆదివాసీ జేఏసీ నాయకులు రీమల పాలు, లకే రామచంద్రుడు, మత్స్యరాస రామ్‌కిరణ్, బొడు వెంకటరమణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పరుగు పోటీలో ప్రసాద్ సత్తా


సిల్వర్ మెడల్‌ను అందుకున్న ప్రసాదు

ముంచంగిపుట్టు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో పెదగూడ పంచాయతీ జర్రిపడ గ్రామానికి గిరిజనుడు చెందిన కుర్తాడి ప్రసాద్ కృష్ణా జిల్లా గుడివాడ ఎంటీఆర్ స్టేడియంలో నిర్వహించిన 44వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాస్టర్స్ అంథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పరుగు పోటీలో 800 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా సోమవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అంథ్లెటిక్స్ అసోసియేషన్ అల్లూరి సీతారామరాజు జిల్లా తరపున కృష్ణా జిల్లాలో ఈ నెల 14, 15వ తేదీలలో జరిగిన పరుగు పందెం పోటీలో 800 మీటర్ల విభాగంలో రెండో స్థానం, 1500 మీటర్లలో రెండో స్థానం, 400 మీటర్లలో రెండో స్థానంలో నిలిచి మొత్తం మూడు సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. దీంతో ఫిబ్రవరి 6, 7 8 తేదీలలో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పరుగు పోటీలకు ఎంపికైనట్టు పేర్కొన్నారు.

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

డుంబ్రిగుడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్లాపుట్టు, బిట్రగండ, కూడా, దేముడువలస గామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కోల్లాపుట్టు పంచాయతీ పరిధిలోని బూసిపుట్టు కూడలిలో ఏర్పాటు చేసిన సదస్సులో ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ అర్జీలు తీసుకున్నారు. దేముడువలసలో ఆర్ఐ రాము గిరిజన రైతుల నుంచి అర్జీలు తీసుకున్నారు. భూ సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఈ సందర్భంగా వారు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు, గిరిజనులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో కిశోరి వికాస శిక్షణ

డుంబ్రిగుడ,డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయ సమవేశ మందిరంలో సోమవారం కిశోరి వికాస శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ పాపినాయుడు, మండల గిరిజన సంక్షేమ శాఖ సహాయాధికారి మల్లికార్జునరావు, వైద్యులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బాల్య వివాహలను అరికట్టేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సచివాలయ, వైద్య, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కోనాం హెల్త్ సెంటర్‌లో సిబ్బంది కొరత



పాడుబడిన ఈ సచివాలయ భవనంలోని ఓ గదిలో హెల్త్ సెంటర్ నిర్వహణ

- 4,700 మంది జనాభాకు ఒక్కరే ఏఎన్ఎం
- రెండు పంచాయతీల్లో 18 గ్రామాలకు ఆమె ఆధారం
- 12 పాఠశాలలు, పది అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులు, పిల్లలకు సక్రమంగా అందని సేవలు
- ప్రైవేటు వైద్యులు, పసర మందులను ఆశ్రయిస్తున్న ప్రజలు
- భవనం, వసతి సమస్యతో ఆశ కార్యకర్తల అగచాట్లు
- మండుటెండలో కూర్చొని విధులు, సమావేశాల నిర్వహణ


కోనాం పాఠశాలలో విద్యార్థులకు వ్యాక్సిన్ వేస్తున్న ఏఎన్ఎం రాజేశ్వరి

కోనాం ఆరోగ్య ఉప కేంద్రాన్ని సిబ్బంది సమస్య వేధిస్తోంది. 4700 మందికి జనాభాకు ఒకరే ఏఎన్ఎం ఉండడంతో ఆరోగ్య సేవలు సక్రమంగా అందని దుస్థితి దాపురిస్తోంది. దీంతో రోగుల పరిస్థితి దయనీయంగా మారుతోంది. గత్యంతరం లేక ప్రజలు ప్రైవేటు వైద్యులు, పసర మందులను ఆశ్రయించి కొత్త సమస్యలు తెచ్చుకోవాల్సి వస్తోంది.

చీడికాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని ఏదైనా ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలో రెండు వేల నుంచి 2500 వరకు జనాభా ఉంటున్నారు. కానీ కోనాం ఆరోగ్య ఉప కేంద్రం పరిధి పెద్దది కావడంతో దాదాపు 4700 మంది జనాభా ఉన్నారు. ఈ కేంద్రం పరిధిలోని కోనాం, మంచాల పంచాయతీల్లో 18 గ్రామాలు ఉన్నాయి. వీటిలో 15 గిరిజన గ్రామాలు కాగా, వాటిలోనూ అటవీ ప్రాంతానికి ఆనుకొని 11 గ్రామాలు ఉన్నాయి. ఈ కేంద్రం పరిధిలోని పది ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. అలాగే అలాగే కోనాం గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో దాదాపు 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక బాలయోగి గురుకుల పాఠశాలలో 580 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. పది అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా బాలికలకు, గర్భిణులకు తనిఖీలు చేయాల్సి ఉంది. ఆరోగ్య పరిస్థితి సీరియస్‌గా ఉన్న వారిని గుర్తించి పీహెచ్‌సీలకుగాని, జిల్లా కేంద్రానికిగాని పంపించాలి. అలాగే ప్రతీ గురువారం కోనాంలో జరిగే వైద్య శిబిరానికి, 104 వైద్య శిబిరానికి సిబ్బంది హాజరుకావాల్సి ఉంది. పాఠశాలల్లో ప్రతీ నెలకు ఒకసారి విద్యార్థులను తనిఖీ చేయాల్సి ఉంది.

వీరందరికీ సేవలు అందించడానికి ఉప కేంద్రంలో ఇద్దరు పర్మినెంట్ ఏఎన్ఎంలు, ఒక సచివాలయ ఏఎన్ఎం, ఒక ఎంఎల్‌హెచ్‌పీ, ఒక హెల్త్ అసిస్టెంట్, ఓ మహిళ హెల్త్ విజిటర్‌లు ఉండాల్సి ఉంది. కానీ, సచివాలయ ఏఎన్ఎం మాత్రమే విధులు నిర్వహిస్తుండగా, విధుల్లో ఉన్న ఎంఎల్‌హెచ్‌పీ ప్రసూతి సెలవులో ఉన్నారు. దీంతో ప్రజలకు సేవలు సక్రమంగా అందడం లేదు. ఈ క్రమంలో గౌరవ వేతనంతో పనిచేస్తున్న ఆశ కార్యకర్తలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో గిరిజనులకు, రోగులకు, విద్యార్థులకు సక్రమంగా వైద్య సేవలు అందడం లేదు. గత్యంతరం లేక వారంతా పసర మందులు, ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. దీనివల్ల ఆర్థిక భారం పడడంతో పాటు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని గిరిజనులు గగ్గోలు పెడుతున్నారు.


లోపల గదిలో స్థలం సరిపడక ఆరుబయటే కూర్చొన్న ఆశ కార్యకర్తలు

భవనం, వసతి సమస్యతో ఇక్కట్లు

ఈ ఆరోగ్య కేంద్రానికి సొంత భవనం లేదు. ఉన్న పాత సచివాలయ భవనంలో ఓ గదిని ఆరోగ్య ఉప కేంద్రానికి, మరో గదిని అంగన్‌వాడీ రెండో కేంద్రానికి పంచాయతీ అధికారులు కేటాయించారు. ఆరోగ్య ఉప కేంద్రం గది చిన్నది కావడంతో ఏఎన్ఎంతో పాటు ఆశ కార్యకర్తలు కూర్చొనేందుకు స్థలాభావ సమస్య ఉత్పన్నమవుతోంది. దీంతో ఆరుబయట విధులు నిర్వహిస్తున్నారు. సమావేశాల సమయంలోనూ మండుటెండలో కూర్చోవాల్సిన దుస్థితి దాపురిస్తోంది. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని, కనీస వసతులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు, గిరిజనులు వేడుకుంటున్నారు.

ఈ విషయమై చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్‌ను వివరణ కోరగా, ఇటీవల హెల్త్ అసిస్టెంట్‌లను ప్రభుత్వం తొలగించగా, ఎంఎల్‌హెచ్‌పీ వరలక్ష్మి ప్రసూతి సెలవులో ఉన్నారని చెప్పారు. కోనాం ఆరోగ్య ఉప కేంద్రంలో సిబ్బంది కొరత విషయమై జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నామన్నారు.

నేడు ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్

గొలుగొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించేందుకు వ్యవసాయాధికారులు చర్యలు చేపట్టారు. 'ధాన్యం విక్రయాలకు రైతుల నిరీక్షణ' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనానికి వారు స్పందించారు. దీంతో కృష్ణాదేవిపేట, గొలుగొండ, చీడిగుమ్మల గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించేందుకు చర్యలు ప్రారంభిస్తున్నట్టు ఏవో సుధావాణి తెలిపారు.

ధనుర్మాస ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

చోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం ఆవిష్కరించారు. ఈ ఏడాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అర్చకులు శాంతారామా, ఆలయ ప్రముఖులు వింజమూరి శంకర్, కందర్ప శంకర్, ఎంపీటీసీ సభ్యుడు నాయుడు పాల్గొన్నారు.

అర్జునగిరిలో ధనుర్మాస ఉత్సవాలు

చీడికాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో అర్జునగిరి గ్రామంలో సోమవారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీదేవి భూదేవి సమేత స్వయంభూ వరహాలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 5 గంటలకు నెల గంట కార్యక్రమం నిర్వహించారు. ప్రతి రోజూ వేకువ జామున మేలుకొలుపు, సాయంత్రం పవలింపుసేవ నిర్వహిస్తున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు పానంగపల్లి శ్రీనివాసాచార్యులు, సర్పంచ్ బి.రమాదేవి తెలిపారు. నెల రోజుల పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని చెప్పారు.

ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీలకు మౌనిక

నర్సీపట్నం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ టోర్నమెంట్‌కు నర్సీపట్నం ప్రాంతానికి చెందిన బొంతు మౌనిక ఎంపికయ్యారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు పంజాబ్‌లోని భటిండాలోని కాశీ యూనివర్సిటీలో నిర్వహించే ఈ పోటీలలో ఆమె పాల్గొంటారు. ఏయూ ఇటీవల జరిగిన బాక్సింగ్ పోటీలో 80 కిలోల విభాగంలో మౌనిక బంగారు పతకం సాధించడంతో ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు అర్హత సాధించినట్టు కోచ్ అబ్బు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు, నిజాంస్ అకాడమీ డైరెక్టర్ వెలగానారాయణరావు అభినందించారు.

21న రక్తదాన శిబిరం

నర్సీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో ఈ నెల 21న రక్తదాన శిబిరం నిర్వహిస్తామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర గణేశ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు, సీహెచ్.సన్యాసిపాత్రుడు, రుత్తల ఎర్రాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పరిష్కార వేదికలో 15 అర్జీలు

నర్సీపట్నం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికలో వివిధ సమస్యలపై 15 అర్జీలు వచ్చినట్టు సబ్ కలెక్టర్ కార్యాలయం సిబ్బంది తెలిపారు. కార్యాలయం ఏవో సూర్యనారాయణ అర్జీదారుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

ఇంధన పొదుపు అందరి బాధ్యత

మాకవరపాలెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు అందరి బాధ్యత అని ఈపీడీసీఎల్ ఏఈ బాలకృష్ణ చెప్పారు. సోమవారం ఇంధన పొదుపు దినోత్సవం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంధన వినియోగాన్ని తగ్గిస్తే దేశ ఆర్థిక అభివృద్ధికి, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఇంధన పొదుపుపై గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఎంఈవో మూర్తి, ఏపీవో వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

20 మద్యం సీసాలు పట్టివేత

చీడికాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిజాం గ్రామ శివారులో 20 మద్యం సీసాలను పట్టుకొని పోలీసు స్టేషన్‌కు తరలించామని ఎస్ఐ బి.సతీశ్ తెలిపారు. గ్రామానికి చెందిన తిలపాక వీరవెంకటసత్యనారాయణ చీడికాడ దుకాణం నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకు వస్తుండగా శిరిజాం శివారు ప్రాంతంలో పటుకున్నట్టు చెప్పారు. ఆయనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

చినపాచిలలో గడ్డి వాము దగ్ధం

రావికమతం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): చిన పాచిల గ్రామంలో సోమవారం మధ్యాహ్నం వరి గడ్డి వాము దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.10 వేల ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన పడిమి కోటేశ్వరావుకు చెందిన గడ్డి వాము గ్రామానికి సమీపంలో ఇటీవలే వరి నూర్పు చేసి పశుగ్రాసం కోసం ఎండి గండిని కుప్పగా వేశారు. అందరూ వ్యవసాయ పనులకు వెళ్లిపోయారు. మధ్యాహ్నం సమయంలో మంటలు ఎగిసిపడి వరి గడ్డి కాలిపోయింది. స్థానికులు గుర్తించి రావికమతం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా శకటం మరమ్మతులకు గురైందని ఎప్పారు. మాడుగుల అగ్నిమాపక కేంద్రానికి సమాచారం తెలపడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు.


ఎమ్మెల్యే రాజును సత్కరిస్తున్న తూర్పు కాపు సంక్షేమ సంఘం సభ్యులు

కాపు భవన్ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాపు భవన్ ఏర్పాటుకు సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రకటించారు. అడ్డూరు సమీపంలో నిర్వహించిన తూర్పుకాపుల వనసమారాధనలో ఆయన మాట్లాడుతూ దుడ్డువీధిలోని కల్యాణ మండపంలో కాపు భవన్ నిర్వహించుకోవచ్చన్నారు. నియోజకవర్గంలో తూర్పు కాపులంతా కూటమి ప్రభుత్వానికి అండ గా నిలిచారని, వారికి రుణపడి ఉంటానని చెప్పారు. అలాగే తూర్పుకాపు యువ నేత సకురు కోటేశ్వరరావుకు సమున్నత స్థానం కల్పిస్తామని హామీ ఇఆచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లునాయుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మజ్జి గౌరీశంకర్, తూర్పు కాపు, కాపురాక్స్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

వేతనాలు ఇప్పించాలని ఎంఈవోకు వినతి

చోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలు విడుదల చేయాలని సీఐటీయూ నేత గూనూరు వరలక్ష్మి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎంఈవో కె.సింహాచలంకు వినతిపత్రం సమర్పించారు. ఐదు నెలలుగా వేతనాలు రావడం లేదని, ప్రభుత్వం స్పందించాలని వారు విన్నవించారు.

పీఏసీఎస్ అవకతవకలపై మరోసారి ఫిర్యాదు

రోలుగుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కుసర్లపూడికి చెందిన కిల్లాడ సాంభమూర్తి, గొల్లు నారాయణరావు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత నెల 25న ఫిర్యాదు చేయగా విచారణ అధికారులు సక్రమంగా విచారణ చేపట్టకుండా అక్రమార్కులకు అండగా నిలిచారని, మరోసారి సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. 2015లో రుణమాఫీ చేసిన సభ్యులకు జప్తు నోటీసులు ఇచ్చి రుణాలను వసూళ్లు చేస్తున్నారన్నారు. పీఏసీఎస్‌ను పూర్తిగా నష్టాల్లోకి నెట్టేశారని, గతంలో నిర్వహించిన ఆడిట్ రిపోర్టులో కూడా రూ.1.5 కోట్ల నష్టం జరిగిందని, దీనిపై సమగ్ర విచారణ నిర్వహించి నిగ్గు తేల్చాలని వారు కోరారు.

ఎమ్మెల్యే బండారుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు

దేవరాపల్లి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పరువు, ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ దేవరాపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు గొర్లె దేముళ్లు, యూట్యూబ్ చానల్ ప్రతినిధి లెక్కల శ్రీనివాసరావుపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు జడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.పాత్రునాయుడు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.సూర్యనారాయణ, చెరకాన సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు తెలిపారు. నీటి సంఘం ఎన్నికల్లో లంచం తీసుకొని పదవులు ఇచ్చారని నిరాధారమైన ఆరోపణలు చేసిన దేముళ్లు, దాన్ని వైరల్ చేసిన శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై ఎస్ఐ టి.మల్లేశ్వరరావు మాట్లాడుతూ లీగల్ అభిప్రాయానికి పంపామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

- పల్లె పండగలో నిధులు సిద్ధంగా ఉన్నాయి..
- అభివృద్ధి పనులు పూర్తిచేయాలి: అధికారులు



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు... హాజరైన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు

కె.కోటపాడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశంగా సాదాసీదాగా జరిగింది. అధికారుల ప్రసంగాలతోనే ముగిసిపోయింది. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జగన్మోహన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో నిర్మించిన గ్రామ సచివాలయాలు, రైతు సేవా కేంద్రాల భవనాలకు బిల్లులు మంజూరు చేయలేదని వైసీపీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మండల ఇంజనీరింగ్ అధికారి సుమతి స్పందిస్తూ, పల్లె పండగలో నిధులు సిద్ధంగా ఉన్నాయని, అభివృద్ధి పనులు పూర్తయిన వెంటనే బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. 6-18 ఏళ్ల పిల్లలు బడిబయట ఉండకూడదని, వీరిని కచ్చితంగా బడుల్లో చేర్పించేలా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ.ప్రసాద్ కోరారు. మండలానికి పది తాగునీటి బోర్లు, డ్రైన్లు మంజూరయ్యాయని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా నిధులు సిద్ధంగా ఉన్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు. అనంతరం ఎంపీడీవో సాంబశివరావు ప్రవేశపెట్టిన 2024-25 మండల పరిషత్ బడ్జెట్, 2025-26 సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఆమోదించారు. అంతకు ముందు రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీవీజీ కుమార్‌ను అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, మండల పరిషత్ ఏవో అప్పలరాజు, అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ తప్పిన నాయకులపై వేటు

- టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు


దేముళ్లును సస్పెండ్ చేయాలని ఫిర్యాదు చేస్తున్న నాయకులు

దేవరాపల్లి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి) తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణతో కూడినదని, పార్టీ సిద్ధాంతాలు ఉల్లంఘిస్తే వేటు తప్పదని పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, చెరకాన సూర్యనారాయణ అన్నారు. రైవాడ అతిథి గృహం వద్ద సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే బండారుపై నిరాధారమైన ఆరోపణలు చేసిన గొర్లె దేముళ్లను సస్పెండ్ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును అధిష్ఠానికి పంపుతున్నట్టు వారు తెలిపారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు పోతల పాత్రునాయుడు, నాయకులు దొగ్గనాయుడు, పి.వెంకటరమణ, నాగేశ్వరరావు, బి.రామారావు, కర్రి నాయుడు, చల్లా నానాజీ, అర్జునరావు, భాస్కరరావు, కోటిపల్లి నాయుడు, కిల్లి గోవింద పాల్గొన్నారు.

సాగునీటి సంఘం విజేతలకు అభినందనలు

చోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌరీపట్నం సాగునీటి సంఘం ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి మద్దతుదారులును టీడీపీ నాయకులు సోమవారం అభినందించారు. సంఘం చైర్మన్‌గా పల్లేల చిన గంగాధరరావు విజయం సాధించారు. వైస్ చైర్మన్, డైరెక్టర్లుగా కూటమి మద్దతుదారులే గెలుపొందారు. వారిని స్థానిక నాయకులు గోపి, కోన శ్రీను తదితరులు అభినందించారు.

నాటుసారాతో ఒకరి అరెస్టు

చోడవరం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెండు లీటర్ల నాటుసారాతో బుచ్చెయ్యపేట మండలం గున్నెంపూడికి చెందిన అన్నంశెట్టి అప్పారావును సోమవారం అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ ఎస్ఐ ఎం.శేఖరం తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు ఆయన చెప్పారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో అప్పన్నదొర ప్రతిభ

దేవరాపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ శివారు శంభువానిపాలెంకు చెందిన ఉగ్గిన అప్పన్నదొర మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించారు. ఈ నెల 14, 15 తేదీలలో కృష్ణా జిల్లా గుడివాడలో జరిగిన 44వ ఏపీ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో పరుగు పందెం, లాంగ్ జంప్ విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. నేవీలో పనిచేస్తూ అప్పన్నదొర విజయాలు సాధించడం పట్ల ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఉగ్గిన దేముళ్లు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

చీడికాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహిస్తామని ఎంపీడీవో వి.హేమసుంద్రరావు తెలిపారు. మంగళవారం శిరిజాం, అప్పలరాజుపురం సచివాలయాలు, 18న ఖండివరం, దిబ్బపాలెం సచివాలయాలు, 19న జైతవరం, బైలపూడి సచివాలయాలు, 20న కోనాం సచివాలయం వద్ద రెండు చోట్ల ఆధార్ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కె.కోటపాడులో...

కె.కోటపాడు: మండలంలోని చౌడువాడ సచివాలయంలో 17, 18 తేదీల్లో చిన్నపిల్లలమొబైల్ ఆధార్ కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సాంబశివరావు తెలిపారు. 19, 20 తేదీల్లో కె.కోటపాడు, 26, 27 తేదీల్లో కె.సంతపాలెం, 28వ తేదీన ఎ.కోడూరు సచివాలయంలో ఈ మొబైల్ ఆధార్ నమోదు కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు. ఆయా పరిసర గ్రామాల ప్రజలు కూడా ఆధార్ కేంద్రాల్లో తమ పిల్లలకు ఆధార్‌కార్డు పొందవచ్చని తెలిపారు.

సదస్సులతో రెవెన్యూ సేవలు సులభతరం

మాడుగుల రూరల్, డిశెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రజలకు రెవెన్యూ సేవలు సులభతరమవుతాయని తహసీల్దార్ రమాదేవి అన్నారు. సోమవారం కేజేపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పప్పుశెట్టిసేరి రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలను తహసీల్దారు స్వీకరించారు. వాటి పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సర్పంచ్ రమణబాబు, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయండి

రోలుగుంట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నంలో ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించే సీపీఎం జిల్లా మహా సభలను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మొదటి సారిగా నర్సీపట్నంలో నిర్వహిస్తున్న ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. అన్ని మండలాల నుంచి అధిక సంఖ్యలో కార్మికులు, గిరిజనులు, వివిధ రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విన్నవించారు.

అర్జీలకు చక్కని పరిష్కారం

- పీజీఆర్ఎస్‌లో అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్.., చిత్రంలో జేసీ జాహ్నవి

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలను సమర్పించిన వారు సంతృప్తి చెందే విధంగా అధికార యంత్రాంగం సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఇక్కడి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆమె జాయింట్ కలెక్టర్ జాహ్నవితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీ అందిన వెంటనే క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అనంతరం సంబంధిత అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ సదరు సమస్యకు చక్కని పరిష్కారం చూపాలన్నారు. ఈ వేదికకు వచ్చే అర్జీలపై మూడు రోజుల్లో చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఆయా అధికారులు వారి శాఖలకు సంబంధించి అందిన అర్జీల పరిష్కార విషయంలో సిబ్బందితో రోజువారీ సమీక్షలు నిర్వహించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పీజీఆర్ఎస్ ముగిసే సరికి 193 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు.


అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి రూరల్ : అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఆయన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రతి ఒక్కరితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులను ఉద్దేశించి పలు సూచనలు చేశారు. ప్రజా సమస్యలపై అందే అర్జీలకు అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కారం చూపాలన్నారు. ఇదిలావుంటే, పీజీఆర్ఎస్ కార్యక్రమం ముగిసే సరికి 35 అర్జీలు అందాయి. వీటిలో భూ తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు తదితరాలకు సంబంధించి ఉన్నాయని పోలీస్ విభాగాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు దేవప్రసాద్, మోహనరావు, ఎస్ఐ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రద్దు చేసిన డి.పట్టాలను ఇవ్వాలని ధర్నా

రావికమతం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగనన్న భూ రీ సర్వేలో రద్దు చేసిన గిరిజనుల డి.పట్టా భూములను తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం మూడు గ్రామాల గిరిజనులు ధర్నా చేశారు. ఆదివాసీ ఐదో షెడ్యూల్ సాధన కమిటీ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కవ్వగుంట, కె.గదబపాలెం, రామన్నదొరపాలెం గ్రామాలకు చెందిన గిరిజనులు ఈ పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం మండల అధ్యక్షుడు రొబ్బా నాగరాజుదొర మాట్లాడుతూ ఈ మూడు గ్రామాల్లో 30 మంది గిరిజనులకు చెందిన డి.పట్టా భూములను రీ సర్వే పేరుతో రద్దు చేసి డీఎల్ఆర్ రికార్డుల్లో ప్రభుత్వ భూములుగా, స్థానికేతరుల పేర్లతో మార్చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ తప్పిదాలను రద్దు చేసి, తిరిగి గిరిజనుల పేరునే భూములు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.గోవిందరావు, రొబ్బా వరహాలుదొర, జి.పెద్దిరాజు, దేవుడమ్మ పాల్గొన్నారు.


ఎంపీడీవో కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

కేకుల స్పెషల్... క్రిస్మస్ కలర్‌ఫుల్

క్రిస్మస్.. కేక్.. ఈ రెండింటిని విడదీయలేం. కేక్ లేకుంటే ఆ సెలబ్రేషన్ అసంపూర్ణమే. క్రిస్మస్ కేక్స్‌లో ప్రపంచవ్యాప్తంగా పేరొందిన 12 వెరైటీలున్నాయి. వీటితో క్రిస్మస్ కలర్‌ఫుల్‌గా జరుపుకోవడం ఆనవాయితీ. ఆయా దేశాల్లో ప్రసిద్ధి చెందిన ఈ కేక్స్ మన దేశంలోనూ వెరైటీగా రూపొందిస్తున్నారు. క్రిస్మస్ నెల అంతా ఈ పన్నెండు కేకలను చాలామంది రెండు రోజులకు ఒకటి చొప్పున ఇంట్లో తయారుచేసుకుని రుచి చూస్తుంటారు. మరికొంతమంది బేకరీల్లో కొనుగోలు చేస్తారు.

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



స్పెషల్ కేక్స్ తయారుచేస్తున్న నగర మహిళలు

- హోంమేడ్ కేకులకు పెరుగుతున్న ఆదరణ
- విదేశాలకూ ఎగుమతి చేస్తున్న వైనం
- కేక్ లవర్స్‌తో కిటకిటలాడుతున్న బేకరీలు

క్రిస్మస్ వస్తోందంటే చాలు.. క్రైస్తవులు కేక్స్‌తో సిద్ధమైపోతారు. ఇంటికి వచ్చిన అతిథులకు కేక్స్ ఇచ్చి రుచి చూడమంటారు. ఈ నెలలో ప్రత్యేకత కలిగిన కేకుల రుచికి ఎవరైనా ఫిదా అయిపోవాల్సిందే. క్రిస్మస్ సందర్భంగా హోం మేడ్ కేక్స్‌లో మాది అందెవేసిన చెయ్యి అంటున్నారు కొంత మంది మహిళలు. ప్లమ్ కేక్స్‌తో పాటు పేస్ట్రీ, చాకెట్, కస్టమైజ్డ్ కేకులు అందంగా రూపొందిస్తున్నారు. కొంతమంది డిమాండ్ మేరకు విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. క్రిస్మస్ స్పెషల్ 12 కేక్స్ రుచిలో దేనికదే ప్రత్యేకంగా నిలుస్తాయి.

బేకరీల్లోనూ...

సిటీలోని పలు బేకరీల్లో ఈ వెరైటీ కేకులకు డిమాండ్ పెరుగుతోంది. దీంతో నగరంలోని ప్రసిద్ధ బేకరీలు కేక్ లవర్స్‌తో కిటకిటలాడుతున్నాయి..

చిన్న ప్లమ్‌కేక్ ధర రూ.15 నుంచి మొదలై...సైజ్‌ని బట్టి పెరుగుతోంది. ఆన్‌లైన్‌లో రూ.350 నుంచి క్రిస్మస్ స్పెషల్ కేక్స్ అందుబాటులో ఉన్నాయి. క్రిస్మస్ స్పెషల్ 12 కేక్స్ ఇవి...

'బ్లాక్ ఫారెస్ట్ కేక్'తో శుభ స్వాగతం



ఈ కేకను క్రిస్మస్ నెల ప్రారంభంలో తయారుచేస్తారు. దీనిని క్రిస్మస్ ఒకటో కేక్ అంటారు. దీని తయారీని ప్రారంభిస్తే నెలంతా మధురంగా ఉంటుందనేది జర్మన్ల మాట.

ఇటాలియన్ క్రీమ్ కేక్

క్రిస్మస్ రెండో కేక్... ఇటాలియన్ క్రీమ్ కేక్. ఇది ఇటలీకి చెందింది. బ్లాక్ ఫారెస్ట్ కేక్ టేస్ట్ అనంతరం క్రైస్తవులు ఈ కేక్‌ను టేస్ట్ చేస్తారు.



హాలీడే కేక్... లేదా క్లాసిక్ వాల్డ్‌రోఫ్ రెడ్

ఇది క్రిస్మస్ మూడో కేక్. చూసేందుకు ఎరుపు, తెలుపు రంగుల్లో ఉండే ఈ కేక్ న్యూయార్క్‌లో ప్రసిద్ధి చెందింది. ఈ కేక్‌ని క్రిస్మస్ హాలిడే కేక్‌గా అక్కడ పిలుస్తుంటారు.



మామ్స్ రమ్ కేక్



ఇది క్రిస్మస్ నాలుగో కేక్. యునైటెడ్ స్టేట్స్‌లోని 'తనాన' సిటీలో కుమారుడికి కోసం ఓ తల్లి తయారుచేసింది. అప్పటి నుంచి ఈ దేశంలో ప్రసిద్ధి చెందింది.

ఫిగ్గీ పుడ్డింగ్



ఇది క్రిస్మస్ ఐదో కేక్. ఇంగ్లాండ్‌లో ప్రసిద్ధిచెందిన కేక్. అక్కడ ఎక్కువగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులకు తల్లులు లంచ్ బాక్స్‌లో పెడుతుంటారు.

డెలిషియస్ స్టిక్కీ టోఫీ పుడ్డింగ్



ఇది క్రిస్మస్ ఆరో కేక్. ఇది కూడా ఇంగ్లాండ్‌కు చెందిన కేక్. ఈ కేక్‌ని రష్యన్లు ఎక్కువగా ఇష్టపడుతుంటారు.

ప్యూర్‌వెజ్.. క్యారెట్ కేక్



ఇది క్రిస్మస్ ఏడో కేక్. యూరప్‌కు చెందిన ప్యూర్ వెజ్ కేక్. ఆ దేశంలో అంత ప్యూర్ వెజ్‌కేక్ మరొకటి లేదంటున్నారు ఆ దేశస్థులు.

మష్రూమ్స్ మేడ్... చాకొలెట్ కేక్



క్రిస్మస్ 8వ కేక్ 'చాకొలెట్‌డికేడెన్స్ యులే లోగ్ కేక్. ఇది యునైటెడ్ స్టేట్స్‌కు చెందింది. పుట్టగొడుగులతో తయారు చేసిన ఈ కేక్ చాలా ప్రసిద్ధి.

వైట్ చాకొలెట్ రాస్బెర్రీ చీజ్ కేక్



ఇది క్రిస్మస్ 9వ కేక్. పూర్తిగా చీజ్‌తో తయారుచేసే ఈ కేక్ యునైటెడ్ స్టేట్స్‌లో విపరీతమైన ఆదరణకు నోచుకుంది.

ఫ్లోర్‌లెస్ చాకొలెట్ కేక్



ఇది క్రిస్మస్ 11వ ఇటాలియన్ కేక్. ఇక్కడ క్రిస్మస్ హాలిడే కేక్ అని కూడా పిలుస్తారు. దీని రుచి అమోఘం.

జింజర్ బ్రెడ్ కేక్



ఇది క్రిస్మస్ 10వ కేక్. ఇది యునైటెడ్ స్టేట్స్‌కు చెందినది. నాలుకకు అంటీ అంటనట్టు మంట, తియ్యగా ఉంటుంది దీని రుచి. ఈ కేక్‌కు అభిమానులు ఫిదా అయిపోతారు.

క్రిస్మస్ ఫ్రూట్ కేక్



ఇది క్రిస్మస్ 12వ కేక్. దీనిని క్రిస్మస్ పండుగ రోజున కెనడాకు చెందిన క్రైస్తవులు తయారు చేశారు. అప్పటి నుంచి ప్రపంచ వ్యాప్తంగా ఈ కేక్‌ను తయారుచేసుకోవడం లేదా, బేకరీల్లో కొనుగోలు చేసి తెచ్చుకోవడం ఆనవాయితీ. క్రైస్తవులందరి ఇంటి క్రిస్మస్ రోజున ఈ కేక్ పక్కాగా ఉంటుంది.

నెలాఖరు నుంచి కాఫీ గింజల కొనుగోలు

- జీసీసీ ద్వారా విక్రయిస్తే మంచి ధర
- దళారులను ఆశ్రయించి మోసపోవద్దు
- రైతులకు జీసీసీ డీఎం దేవరాజు సూచన



మాట్లాడుతున్న జీసీసీ డీఎం దేవరాజు

చింతపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్ పరిధిలో నెలాఖరు నుంచి కాఫీ గింజల కొనుగోలు ప్రారంభిస్తామని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) డీఎం పి.దేవరాజు తెలిపారు. సోమవారం పెదబరడ, కొండంచుల గ్రామాల్లో గిరిజన రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగా ఈ ఏడాది కూడా జీసీసీ ద్వారా గిరిజన రైతులకు గరిష్ఠ ధరలు అందిస్తామన్నారు. ఈ ఏడాది కాఫీ దిగుబడులు ఆలస్యం కావడం వల్ల రైతులు పండ్ల సేకరణ ఆలస్యమవుతుందన్నారు. రైతులు నాణ్యమైన పండ్లను సేకరించి పార్చిమెంట్ చేసుకోవాలన్నారు. మార్కెట్‌లో పార్చిమెంట్‌కి అధిక ధర లభిస్తుందన్నారు. జీసీసీ ద్వారా కిలో పార్చిమెంట్ రూ.285, చెర్రీ రూ.150, రొబస్టా రూ.80 ధరకు కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు జీసీసీ చెల్లిస్తున్న ధర కంటే తక్కువగా మార్కెట్‌లో గింజలను విక్రయించుకోరాదన్నారు. రైతులు జీసీసీ ద్వారా మార్కెటింగ్ చేసుకోవడం వల్ల మంచి ధర పొందవచ్చునన్నారు. దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. జీసీసీ సిబ్బంది రైతుల ఇళ్ల వద్దకు వచ్చి కాఫీ గింజలను కొనుగోలు చేస్తారన్నారు. ఈ ఏడాది సబ్ డివిజన్ పరిధిలో 650 టన్నుల గింజల కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించామని చెప్పారు.

800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

అచ్యుతాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడిమడక శివారు కడపాలెం తోటల్లో నాటుసారా తయారీ బట్టీలపై సోమవారం దాడి చేసి, 800 లీటర్ల బెల్లం పులుసును పారబోసినట్టు ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ తేజో వెంకటకుమార్ తెలిపారు. ఇంకా 80 కిలోల బెల్లం, 50 కిలోల అమ్మోనియాను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో అనకాపల్లి ఈఎస్‌టీఎఫ్ సీఐ ఎన్.శ్రీనివాసరావు, ఎస్ఐలు గణేశ్, వీవీ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

వరి కోతలకు కూలీల కొరత

... 5వ పేజీ తరువాయి

రూ.350 నుంచి రూ.400 వరకు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆడ కూలీ రూ.500, మగ కూలీ రూ.700 డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఎకరా వరి కోతకు రూ.5 వేలు ఇవ్వాలని కాంట్రాక్టుగా అడుగుతున్నారు. కూలి రేట్లు పెరగడం వల్ల ఎకరాకు రూ.2-3 వేల వరకు అదనంగా ఖర్చు అవుతుందని చెబుతున్నారు. అయినాసరే వెంటనే వరి కోతలు పూర్తిచేయడానికి కూలీలు లభించని పరిస్థితి నెలకొంది. కొంతమంది రైతులు వ్యవసాయ పనులు తక్కువగా వుండే గ్రామాలకు వెళ్లి కూలీలను మాట్లాడుకొని ఆటోల్లో తీసుకువస్తున్నారు. ఎకరాలోపు వరి పొలం వున్న చిన్నా చితకా రైతులు, రెట్టింపు కూలి ఇవ్వలేక కుటుంబ సభ్యులంతా కలిసి వరి పైరు కోసుకుంటున్నారు. అధిక విస్తీర్ణంలో వరి సాగు చేపట్టిన రైతులు మాత్రం కూలీలపై ఆధారపడక తప్పడంలేదు.

కాసులిస్తేనే రిజిస్ట్రేషన్

... 5వ పేజీ తరువాయి

కొనుగోలుదారులు వాపోతున్నారు. ఒక శాతం సొమ్మును లంచంగా ఇవ్వకపోతే ఏవేవో కొర్రీలు పెట్టి రిజిస్ట్రేషన్‌ను పెండింగ్‌లో పెడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మళ్లీ మంచి ముహూర్తం ఇప్పట్లో ఉండదేమోనన్న ఉద్దేశంతో ఆస్తి కొనుగోలుదారులు ఒక శాతం సొమ్ము అదనంగా సమర్పించుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగించుకుంటున్నారు. నర్సీపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబరు వరకు 5,343 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు జరిగాయి. ప్రభుత్వానికి రూ.12.78 కోట్ల ఆదాయం వచ్చింది. రోజుకు సరాసరి 30 వరకు డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయి. ఒక శాతం మామూళ్ల ప్రకారం గత ఎనిమిది నెలల్లో కోటి రూపాయలకుపైగా కక్షిదారులు సమర్పించుకున్నారు.

కాగా రిజిస్ట్రేషన్ విలువపై ఒక శాతం సొమ్మును మామూళ్లుగా తీసుకుంటున్నట్టు వస్తున్న ఆరోపణపై సబ్‌రిజిస్ట్రార్ కమలను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఎవరి వద్దా డబ్బులు తీసుకోవడం లేదని తెలిపారు. దస్తావేజు లేఖర్లు డబ్బులు వసూలు చేస్తే తమకు సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	103.00
లైవ్ ధర	123.00
విత్ స్కిన్	216.00
స్కిన్ లెస్	226.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	620
విజయనగరం	624
శ్రీకాకుళం	624

ఉత్తమ పంచాయతీల సర్పంచులకు సత్కారం

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు గ్రామ పంచాయతీల పాలకులు రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ అవార్డులు తీసుకోవడం చాలా సంతోషకరమని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. ఇటీవల భారత రాష్ట్రపతి చేతుల మీదుగా దీన్ దయాల్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు అందుకున్న నక్కపల్లి మండలం న్యాయంపూడి పంచాయతీ సర్పంచ్ రెడ్డి వరహాలు బాబు, అనకాపల్లి మండలం తగరంపూడి పంచాయతీ సర్పంచ్ యాదగిరి అప్పారావులను సోమవారం కలెక్టరేట్‌లో ఆమె అభినందించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మరింత బాగా పనిచేసి జిల్లాకు మరిన్ని అవార్డులు వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి, డీపీవో ఆర్.శిరీషారాణి, డీపీఆర్సీ జిల్లా కో-ఆర్డినేటర్ ఈ.నాగలక్ష్మి, ఈవోఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



తగరంపూడి సర్పంచ్ యాదగిరి అప్పారావు, న్యాయంపూడి సర్పంచ్ రెడ్డి వరహాలుబాబును అభినందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఇతర అధికారులు

సముద్ర తీర ప్రాంత రక్షణకు పటిష్ఠ చర్యలు

- కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సుదీర్ఘ సుముద్రతీరం, కీలకమైన పరిశ్రమలు ఉన్నందున వీటిని తిలకించేందుకు వచ్చే పర్యాటకులతోపాటు తీర ప్రాంత రక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తీరప్రాంత రక్షణ పోలీస్ జిల్లాస్థాయి కమిటీ సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్వదినాలు, వారాంతపు సెలవుల్లో ప్రసిద్ధ బీచ్‌ల వద్ద ప్రత్యేక సిబ్బందిని నియమించాలని సూచించారు. మెరైన్ పోలీస్‌స్టేషన్‌కు మౌలిక సదుపాయాలు కల్పించడానికి తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. సముద్రంలో చేపల వేట సాగించే ప్రతి బోటుకు రిజిస్ట్రేషన్ ఉండాలని చెప్పారు. పరిశ్రమల్లో కార్మికుల నియామకాలు చేపట్టేటప్పుడు ఆయా కార్మికుల పూర్తి సమాచారం సేకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఎస్పీలు మధుసూదనరావు, దేవప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

రెండు కుటుంబాల మధ్య భూ వివాదం

- పంట కోతల సందర్భంగా పరస్పర దాడులు
- ఐదుగురికి గాయాలు
- పోలీసులకు ఇరువర్గాల ఫిర్యాదు

చోడవరం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాకిపల్లి పంచాయతీ రామజోగిపాలెంలో రెండు కుటుంబాల మధ్య నెలకొన్న భూ వివాదం నేపథ్యంలో సోమవారం ఒకరిపై మరొకరు కత్తులు, కర్రలతో దాడులకు దిగడంతో ఇరుపక్షాలకు చెందిన ఐదుగురు గాయాలపాలయ్యారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రామజోగిపాలేనికి చెందిన కిల్లి దాలినాయుడు కుటుంబానికి, అదే గ్రామానికి చెందిన లెక్కల గోవింద్, దేముడు కుటుంబీకులకు మధ్య భూ వివాదం నడుస్తున్నది. ఈ నేపథ్యంలో వివాదాస్పద భూమిలో లెక్కల దేముడు కుటుంబీకులు సోమవారం వరి పంట కోయడానికి రంగంలోకి దిగడంతో తమ పొలంలో పంట అక్రమంగా కోస్తున్నారంటూ దాలినాయుడు కుటుంబీకులు నిలువరించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య ఘర్షణ పెరిగి ఒకరిపై మరొకరు దాడులకు పాల్పడ్డారు. కత్తులు, కర్రలతో దాడులకు దిగడంతో దాలినాయుడు, కిల్లి చంద్రమ్మ, కిల్లి రాములకు బలమైన గాయాలయ్యాయి. లెక్కల దేముడు కుటుంబానికి చెందిన ఇద్దరు గాయపడ్డారు. ఇరుపక్షాలు ఇచ్చిన ఫిర్యాదులపై విచారణ చేసి కేసులు నమోదు చేయనున్నట్టు సీ ఐ పి.అప్పలరాజు సోమవారం రాత్రి తెలిపారు.

22న రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే పోటీలు

- ట్రోఫీని ఆవిష్కరించిన సినీ నటుడు సుమన్



ట్రోఫీని ఆవిష్కరించిన సుమన్

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22వ తేదీన రాష్ట్రస్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. వీవీ రమణ రైతుభారతి కల్యాణ మండపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో చాంపియన్‌షిప్ ట్రోఫీని సినీనటుడు సుమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో మహిళలకు ఆత్మరక్షణ నైపుణ్యాలు ఎంతో అవసరమని, చిన్ననాటి నుంచి కరాటే నేర్చుకుంటే ఆత్మరక్షణే కాకుండా ఉద్యోగాల భర్తీలో ప్రాధాన్యం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, చీఫ్ కోచ్ ఎస్‌పీఎండీ నాయుడు, కరాటే అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు విద్యార్థిని ఎంపిక



జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికైన పూజిత రెడ్డిని అభినందిస్తున్న అధ్యాపకులు

చింతపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి అండర్-19 తైక్వాండో పోటీలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని సీహెచ్.పూజిత రెడ్డి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ కె.గోవిందరావు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సీహెచ్.పూజిత రెడ్డి అక్టోబరు 4న కడపలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం సాధించిందన్నారు. మధ్యప్రదేశ్ దివాస్‌లో ఈ నెల 19 నుంచి నిర్వహించే 68వ జాతీయ స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైందని చెప్పారు. ఆ విద్యార్థినిని అధ్యాపకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శివకుమార్, ఈశ్వరరావు, ఈశ్వరనాయుడు పాల్గొన్నారు.

క్రైం... crime news

కారులో నుంచి బంగారు నగలు, నగదు అపహరణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై కొత్తూరు సమీపంలో ఆదివారం రాత్రి ఒక కారులో నుంచి నగలు, నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. పట్టణ ఎస్ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన సమాచారం ప్రకారం.. విశాఖపట్నం జిల్లా పెందుర్తికి చెందిన తెల్లాకుల హర్షబాబు, కుటుంబ సభ్యులు కలిసి ఈ నెల 13వ తేదీన అరకు, పాడేరు, లంబసింగి ప్రాంతాల సందర్శనకు వెళ్లారు. ఆదివారం రాత్రి నర్సీపట్నం మీదుగా అనకాపల్లి వైపు వస్తూ కొత్తూరు వద్ద జాతీయ రహదారి పక్కన కారు పార్కింగ్ చేసి దాబాలో భోజనానికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు కారు పక్క డోర్ అద్దాన్ని పగులగొట్టి కారులో ఉన్న 53 గ్రాముల బంగారం వస్తువులు, రూ.40 వేలు నగదు, ఐ ఫోన్ అపహరించుకుపోయారు. భోజనం చేసి తరువాత కారు వద్దకు వచ్చిన తరువాత చోరీ జరిగినట్టు గుర్తించారు. ఆదివారం రాత్రి ఇంటికి వెళ్లిపోయారు. సోమవారం ఉదయం హర్షబాబు అనకాపల్లి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ తెలిపారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడి మృతి



వేచలపు మణికంఠ (ఫైల్ ఫొటో)

చీడికాడ, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీనికి సంబంధించి ఎస్ఐ సతీశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. చీడికాడకు చెందిన వేచలపు మణికంఠ(23) రోజూ మద్యం సేవిస్తూ ఇంట్లో గొడవపడుతుండేవాడు. ఈ క్రమంలో 11వ తేదీన అతని భార్య లక్ష్మి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన మణికంఠ ఇంట్లో ఫ్యాన్‌కి ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే కిందకు దింపి పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి, తరువాత విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుని భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్టు చేశామని స్థానిక ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. స్థానిక అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద ఈ ఏడాది సెప్టెంబరులో వాహనాల తనిఖీల్లో 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల్లో ఒకరైన విశాఖపట్నం ఆరిలోవ పరిధి కృష్ణాపురం ప్రాంతానికి చెందిన చిన్నాడ రాజు పరారయ్యాడు. అతని కోసం పోలీసులు గాలించగా, ఎట్టకేలకు సోమవారం అరెస్టు చేశారు.

కోళ్లఫారంలో యువతి ఆత్మహత్య

... 5వ పేజీ తరువాయి

సంఘటనకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

కోటవురట్ల మండలం గొట్టివాడ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి మాకవరపాలెం మండలం జంగాలపల్లిలో కోళ్లఫారం లీజుకు తీసుకుని నడుపుతున్నారు. ఫారంలో పనిచేసేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం బడిమేల గ్రామానికి చెందిన భార్యాభర్తలు గొల్లూరి శాంతి, కొర్రా చరణ్‌లు ఆరు నెలలు కిందట ఇక్కడకు వచ్చారు. రోజూ మాదిరిగానే సోమవారం ఉదయం కోళ్లకు దాణా పెట్టారు. ఈ క్రమంలో శాంతి వ్యర్థాలతో వున్న నీటిని కోళ్లకు సమీపంలో పోయడంతో చరణ్ మందలించాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె కోళ్లఫారానికి అనుబంధంగా వున్న గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొద్దిసేపటి తరువాత చరణ్ గది వద్దకు వెళ్లి చూడగా టవల్‌తో ఉరివేసుకొని కనిపించింది. తలుపులు తీసి మృతదేహాన్ని కిందకు దించి చూడగా అప్పటికే చనిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు కోళ్ల ఫారం వద్దకు వచ్చి పరిశీలించారు. యువతి తల్లిదండ్రులకు సమాచారం అందించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

ఎలమంచిలిలో భారీ చోరీ

... 5వ పేజీ తరువాయి

అద్దెకు వుంటున్న వారికి చెప్పగా, అందరూ కలిసి మేడ మీదకు వెళ్లారు. ఇంటి తలుపులు తీసి వుండడంతో పట్టణంలోనే నివాసం వుంటున్న రమణ సోదరుడు గోవిందరాజులుకు ఫోన్ చేసి చెప్పారు. ఆయన వెంటనే వచ్చి ఇంటిలోపలికి వెళ్లి పరిశీలించారు. అనంతరం రమణకు ఫోన్ చేసి చోరీ జరిగిన విషయం చెప్పారు. ఇంటిలో రూ.4 లక్షల నగదు, 4 తులాల బంగారం ఆభరణాలు కనిపించడంలేదని గుర్తించారు. ఈ మేరకు రమణ తరఫున ఆయన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులతోపాటు అనకాపల్లి నుంచి క్లూస్ టీమ్‌వచ్చి ఆధారాలు సేకరించింది. చోరీ సంఘటనపై పట్టణ ఎస్ఐ సావిత్రిని వివరాలు కోరగా.. చోరీ జరిగినట్టు ఫిర్యాదు అందిందని, ఇంటి యజయాని వచ్చిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.